# గంజాయి ముఠా అరెస్టు

**రూ.35 లక్షల విలువ చేసే గంజాయిని పట్టుకున్న టాస్క్‌ఫోర్స్ పోలీసులు, నలుగురి అరెస్టు, 2 వాహనాలు స్వాధీనం**



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న నార్త్‌జోన్ అడిషనల్ కమిషనర్ మధుసూదన్ రావ్, ఏసిపి సైదాబాబు, సిఐ బి.ఎల్.ఎన్.రెడ్డి తదితరులు

కంటోన్మెంట్, జనవరి 9 ప్రభాతవార్త: అక్రమంగా గంజాయిని తరలిస్తున్న ఓ ముఠాను ఉత్తర మండలం టాస్క్ ఫోర్స్, బోయిన్‌పల్లి పోలీసుల సంయుక్త ఆధ్వర్యంలో తనిఖీలు నిర్వహించి వారి వద్ద నుంచి 130 కిలోల గంజాయి. రెండు వాహనాలను స్వాధీనం చేసుకొని ముగ్గురిని నిందితులను అదుపులోకి తీసుకున్నట్లు నార్త్ జోన్ అడిషనల్ డిసిపి జి.మధుసూదన్ రావ్ తెలిపారు. మంగళ వారం బోయిన్‌పల్లి పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాజస్తాన్‌కు చెందిన జైసింగ్ బాటీ 44, రూప్ చంద్ కచ్వా 27, ప్రేమ్‌కుమార్ 35 అనే ముగ్గురు వ్యక్తులు జీడిమెట్లలో నివాసం ఉంటున్నారు. వీరు ఈ నెల 8వ తేదీన రాత్రి 35 లక్షల విలువ చేసే 130 కిలోల గంజాయిని నెంబర్ ప్లేట్‌లేని మారుతీ కారు, 1 బొలేరో వాహనం నుంచి రాజమండ్రి నుంచి మేడ్చెల్‌కు తరలిస్తున్నారు. ఉత్తర మండలం టాక్స్‌ఫోర్స్, బోయిన్‌పల్లి పోలీసుల సంయుక్త ఆధ్వర్యంలో డైమాండ్ పాయింట్ వద్ద తనిఖీలు నిర్వహిస్తుండగా పట్టుబడ్డారు. వారి నుంచి 3 సెల్‌ఫోన్‌లు, 130 కిలోల గంజాయి, రెండు వాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు ఆయన తెలిపారు. రాజమండ్రి నుంచి సరఫరా చేస్తున్న ప్రముఖ వ్యక్తి రంజన్, మంగీలాల్, ధర్మేందర్‌లు పరారీలో ఉన్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో టాక్స్‌ఫోర్స్ డిప్యూటీ కమిషనర్ ఏ.వి. ఆర్.నర్సింహ్మారావు, రామలింగరాజు, బేగంపేట్ ఏసిపి సైదాబాబు, బోయిన్‌పల్లి ఇన్‌స్పెక్టర్ లక్ష్మి నారాయణ రెడ్డి, ఎస్ఐలు అనంత చారి, సాయిరామ్, రాఘవేందర్ రెడ్డి, నాగేంద్రబాబు తదితరులు పాల్గొన్నారు.

## ఆటో డ్రైవర్ల సమస్యలను పరిష్కరించాలి: చాడ వెంకట్‌రెడ్డి

సైఫాబాద్, జనవరి 9 ప్రభాతవార్త: రాష్ట్ర వ్యాప్తంగా లక్షలాది మంది ఆటో డ్రైవర్లు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కారించాలని సిపిఐ జాతీయ కార్యదర్శి చాడ వెంకట్‌రెడ్డి, ఆటో యూనియన్ జెఎసి నాయకులు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు మంగళవారం చాడ వెంకట్‌రెడ్డి, జెఎసి నాయకులు బి.వెంకటేశం, ఎ.భిక్షపతి యాదవ్ తదతరులు రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌కు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా చాడ వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ ఆటో డ్రైవర్లు అనేక సమస్యలను ఎదుర్కొంటున్నారని, వారికి న్యాయం చేయాలని కోరారు. మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ త్వరలో యూనియన్ నాయకులతో కలిసి మాట్లాడతానని చెప్పారు.

## గాంధీ ఆస్పత్రి డైట్ కిచెన్‌లో రోటిమేకర్ ప్రారంభం




రోటీ మేకర్‌ను ప్రారంభిస్తున్న సూపరింటెండెంట్ డాక్టర్ రాజారావు

సికింద్రాబాద్, జనవరి 9 ప్రభాతవార్త: సికింద్రాబాద్ గాంధీ ఆస్పత్రి లోని డౌట్ కిచెన్‌లో నూతన రోటీ మేకర్‌ను ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రాజారావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డైట్ కిచెన్‌లో రోగులకు, వారి బంధువులకు రుచికరమైన, స్వచ్ఛమైన భోజనాన్ని అందజేయాలనే లక్ష్యంతో ఏర్పాట్లు జరపుతున్నట్లు తెలిపారు. నూతనంగా ఏర్పాటు చేసిన రోటి మేకర్‌తో కేవలం గంట సమయంలోనే వెయ్యి రోటీలకు పైగా సిద్ధం చేయవచ్చని తెలిపారు. రోగులకు, వారి బంధువులకు వేడివేడిగా రోటీలను అందజేయడం సాధ్యమవుతుందని పేర్కొన్నారు. అనంతరం డైట్ కిచెన్ ప్రాంతంలోని ఖాళీ స్థలంలో మొక్కలను నాటారు.

## స్కూల్లో మధ్యాహ్న భోజనాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసిన ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి



విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి

నాచారం, జనవరి 9 ప్రభాతవార్త: నాచారం వెస్లీ స్కూల్లో మంగళవారం ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి స్థానిక కార్పోరేటర్ శాంతి సాయిజన్ శేఖర్‌తో కలిసి ఆకస్మికంగా తనిఖీ చేశారు. పిల్లలకు పరిశుశుభ్రమైన నాన్యతతో కూడిన ఆహారాన్ని అందించాలని అక్కడి సిబ్బందికి సూచించారు. అనంతరం ఆయన పిల్లలతో కలిసి భోజనం చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు మేకల ముత్యం రెడ్డి, సాయిజన్ శేఖర్, మల్లేష్ యాదవ్, విఠల్ యాదవ్, అశ్వథ్థామ రెడ్డి, కట్టబుచ్చన్న గౌడ్, మారయ్య, బాలమణి, కామేశ్వరీ, ప్రీతి రెడ్డి, సుజాత నాయక్, భారతమ్మ, గుండు రమేష్, స్వామి షేక్, మక్తాల శేఖర్ గౌడ్, చంద్రశేఖర్, అర్జున్, కిట్టు, హెచ్‌ఎం రాజ్యలక్ష్మి, కోటేశ్వర్ రావు తధితరులు పాల్గొన్నారు.

## బస్తీ దావఖానాలో చోరీ

దుండిగల్, జనవరి 9, ప్రభాతవార్త : దుండిగల్ మున్సిపాలిటీ పరిధి దొమ్మరపోచంపల్లి సర్వే నంబర్ 120లోని బస్తీ దావఖానలో గుర్తు తెలియని దుండ గులు చోరికి పాల్పడ్డారు. దవాఖాన తాళం పగుల గొట్టి లోపలికి చొరబడిన దుండగులు సర్జికల్ వస్తువులు, బీపీ మిషన్, ఇతరత్రా వస్తువు లను ఎత్తుకెళ్ళారు. స్థానికుల సమాచారం మేర కు ఘటన స్థలికి చేరుకున్న పోలీసులు పరిశీలించి ఆధారాలు సేకరించారు. దాదఖాన సిబ్బంది ఫిర్యా దు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.

## బహదూర్‌పుర నియోజకవర్గం సమస్యలపై సిఎంకు వినతి

చార్మినార్, జనవరి 9 ప్రభాతవార్త : పాతబస్తీ బహదూర్‌పుర అసెంబ్లీ నియోజకవర్గంలోని పలు సమస్యలపై రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి బహదూర్‌పుర నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంఛార్జి పులిపాటి రాజేష్ కుమార్ వినతి పత్రం అందజేశారు. డాక్టర్. మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి సంస్థలో బహదూర్‌పుర నియోజకవర్గం రివ్యూ సమావేశం జరిగింది. పాతబస్తీ బహదూర్‌పుర అసెంబ్లీ నియోజకవర్గంలో మినీ బస్సులు ఏర్పాటు చేయాలని, మెట్రో రైలు, యాభై పడకల ఆసుపత్రిని నెల కొల్పాలని, నూతన రహదారులు, మంచి డ్రైనేజీ వ్యవస్థను ఏర్పాటు చేయాలని కోరుతూ కాంగ్రెస్ ఇంఛార్జి రాజేష్ కుమార్ ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డికి వినతి పత్రం అందజేశారు. ముఖ్యమంత్రికి బొకే అందజేసి నూతన సంవత్సరం శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా పులిపాటి రాజేష్ కుమార్ మాట్లాడుతూ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు కాంగ్రెస్ పార్టీ పటిష్టత కోసం పాటు పడాలని కోరారు.



# హైదరాబాద్ వార్త

**రాజు లేని రాజ్యంలా శేరిలింగంపల్లి రెవెన్యూ యంత్రాంగం**

# అక్రమార్కులకు వరం!

- ప్రభుత్వ స్థలాలను అందినకాడికి ఆక్రమించుకుంటున్న అక్రమార్కులు
- గౌలిదొడ్డిలో ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించి భారీ నిర్మాణాలు

హైటెక్ మండలం శేరిలింగంపల్లి రెవెన్యూ యంత్రాంగం పరిస్థితి రాజు లేని రాజ్యంలా మారింది. తెలంగాణ రాష్ట్రంలోనే అత్యంత ఖరీదైన మండలంగా పేరుగాంచిన శేరిలింగంపల్లి మండలానికి పూర్తిస్థాయి తాహశీల్దార్ లేకపోవడం అక్రమార్కులకు వరంగా మారింది. ప్రభుత్వ స్థలాల అక్రమణను అడ్డుకునే వారు లేకపోవడంతో శేరిలింగంపల్లిలో అక్రమార్కులు చెలరేగిపోతున్నారు. కనిపించిన భూమిని కనిపించినట్టు మాయం చేస్తూ భూఆక్రమాలకు తెరలేపుతున్నారు. ప్రభుత్వ స్థలాల కబ్జాలపై స్పందించే వారు లేకపోవడం, కింది స్థాయి సిబ్బంది సైతం సక్రమంగా స్పందించకపోవడంతో కబ్జాదారులు ఆడిందే ఆటగా మారింది. నిన్న మొన్నటి వరకు ప్రభుత్వ స్థలం బోర్డులతో దర్శనమిచ్చిన ప్రభుత్వ స్థలాలు నేడు బహుళ అంతస్థుల శాశ్వత నిర్మాణాలతో కనిపిస్తున్నాయి.



గౌలిదొడ్డిలో ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించి చేపడుతున్న నిర్మాణం



గతంలో ఇదే స్థలంలో ప్రభుత్వ అధికారులు ఏర్పాటు చేసిన బోర్డు(ఫైల్‌ఫోటో)

గచ్చిబౌలి, జనవరి 9 ప్రభాతవార్త : కోట్లాది రూపాయల విలువైన ప్రభుత్వ స్థలాలు శేరిలింగంపల్లిలో ఆక్రమణకు గురవుతున్నా అడ్డుకునే వారు లేకుండా పోయారు. తాజాగా మండల పరిధిలోని సర్వే నెంబరు 74లోని గౌలిదొడ్డి ప్రభుత్వ పాఠశాల వెనుక ఉన్న ప్రభుత్వ స్థలానికి సైతం రెక్కలు వచ్చాయి. దాదాపు 600 గజాల ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించిన కొంత మంది అక్రమార్కులు ఏకంగా భారీ బహుళ అంతస్థుల నిర్మాణం చేపడుతున్నారు. దీనికి సంబం ధించిన వివరాలు ఇలా ఉన్నాయి.

హైటెక్ మండలం శేరిలింగంపల్లి లో నేడు గజం స్థలం విలువ అక్షరాల లక్షన్నర రూపాయల నుంచి రెండు లక్షల వరకు పలు కుతుంది. ముఖ్యంగా ఐటి కారిడార్‌కు ఆను కొని ఉన్న గోపన్‌పల్లి, గౌలిదొడ్డిల్లో భూముల విలువ లక్షల్లో ఉంది. పెరిగిన భూముల ధరలతో కబ్జా దారుల చూపు స్థానికంగా ఉన్న ప్రభుత్వ స్థలాల మీద పడింది. రాత్రికి రాత్రే ప్రభుత్వ స్థలాలను హస్త గతం చేసుకొని, భారీ నిర్మా ణాలు చేపడుతున్నారు. మరికొందరు ఎక్కడో గ్రామం లో ఉన్న ఇంటి నెంబర్లతో ప్రభుత్వ స్థలాల్లో జీహెచ్ ఎంసీ నిర్మాణ అనుమతులు పొంది అక్రమించుకుం టున్నారు. మండల పరిధిలోని గోపన్‌పల్లి సర్వే నెంబరు 74లో గౌలిదొడ్డి ప్రభుత్వ పాఠశాల వెనుక ప్రభుత్వ స్థలం ఉంది. ఈ స్థలాన్ని గతకొన్ని సంవత్స రాలుగా కబ్జాదారులు హస్తగతం చేసుకునేందుకు ప్రయత్నిస్తున్నారు. గతంలో ఇక్కడి ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించి పలు గదుల నిర్మాణం చేపట్టగా, నాటి రెవెన్యూ అధికారులు అడ్డుకొని కూల్చివేసి ప్రభుత్వ స్థలం బోర్డులు ఏర్పాటు చేశారు. కాగా ప్రస్తుతం శేరిలింగంపల్లిలో శాశ్వత తాహశీల్దార్ లేకపోవడం, ఉన్న కిందిస్థాయి సిబ్బంది సైతం కొత్తగా రావడంతో ప్రభుత్వ స్థలం ఆక్రమణకు ఇదే అనువైన సమయంగా భావించిన అక్రమార్కులు మరోసారి ఆక్రమణకు తెరలేపారు. గత అసెంబ్లీ ఎన్నికల ముందు వరకు ప్రభుత్వ స్థలం బోర్డుతో ఉన్న గౌలిదొడ్డి ప్రభుత్వ పాఠశాల వెనుక ఉన్న ప్రభుత్వ స్థలాన్ని రాత్రికి రాత్రే చదును చేశారు. ఏకంగా భారీ బహుళ అంతస్థుల నిర్మాణం కోసం పిల్లర్లతో ఇంటి నిర్మాణం చేపట్టారు. దాదాపు 600 గజాల స్థలాన్ని ఆక్రమించిన కబ్జాదా రులు మొదటి స్లాబ్ వేసి భారీ బహుళ అంతస్థుల నిర్మాణం చేపట్టడం గమనార్హం. గజం అక్షరాల లక్ష రూపాయల పైనే ఉన్న గౌలిదొడ్డిలో ఆక్రమణకు గురైన ప్రభుత్వ స్థలం విలువ దాదాపు 10కోట్ల పైమాటే. ఓవైపు ప్రభుత్వ కార్యాలయాలకు, సంక్షేమ భవనాలకు ప్రభుత్వ స్థలం లేదంటున్న పాలకులు ఉన్న ప్రభుత్వ స్థలాన్ని కాపాడుకోలేని దీన స్థితిలో ఉండడం గమనార్హం. ఇప్పటికైనా అధికారులు స్పందించి విలువైన ప్రభుత్వ స్థలం ఆక్రమణకు గురికాకుండా కాపాడాలని స్థానికులు కోరుతున్నారు.



బల్కంపేట ఎల్లమ్మ పోచమ్మ దేవస్థానంలో

## శతచండీ యాగ సహిత మహాకుంభాభిషే మహోత్సవాలు

సంజీవరెడ్డి నగర్, జనవరి 9, ప్రభాతవార్త: దేవాదాయ ధర్మాదాయ శాఖ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం హైదరాబాద్‌లోని బల్కంపేట శ్రీ ఎల్లమ్మ పోచమ్మ దేవస్థానంలో ఈనెల 27వ తేదీ నుండి 31వ తేదీ వరకు శ్రీ జగద్గురు ఆదిశంకరాచార్య కంచికామకోటి మూలామ్నాయ సర్వజ్ఞ పీఠాధిపతి శ్రీశ్రీశ్రీ శంకర విజయేంద్ర సరస్వతీ స్వామి కరకమలములచే శతచండీయాగ సహిత మహాకుంభాభిషేక మహోత్సవాలను అత్యంత వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఈ మహోత్సవాలకు భక్తులు దంపతులు ఇరువురికి అయిదురోజులకు గాను రూ. 5,580 ఉభయ రుసుముగా నిర్ణయించినట్లు తెలిపారు. భక్తులు ఈ మహదవకాశాన్ని ఉపయోగించుకుని శ్రీఅమ్మవారి కృపకు పాత్రులు కావాలని కోరారు. శతచండీయాగ సహిత మహా కుంభాభిషేకం పూజలో పాల్గొను భక్తులు రూ. 5,580లు దేవస్థాన కార్యాలయంలో చెల్లించి రశీదు పొందాలని ఆలయ కమిటీ ఈఓ కె.నాగరాజు, ఆలయ చైర్మన్ సాయిబాబాగౌడ్, ప్రధాన అర్చకులు అనిల్ కుమార్‌లు తెలిపారు.

## నగరంపై పట్టు కోసం కాషాయం దళం కార్యాచరణ



### అయోధ్య రామమందిరం అంశంతో జనంలోకి బిజెపి

**నష్టానికి కారణాలివే..**

**శాసనసభ ఎన్నికల్లో నష్టం కలిగించిన అంశాలపై పార్టీ పూర్తిస్థాయిలో సమీక్షిస్తోంది. శాసనసభ ఎన్నికల్లో అభ్యర్థుల ప్రకటనలో జాప్యం, ఎన్నికల ప్రచారం మొక్కుబడిగా సాగడం ఫలితాలను ప్రభావిం చేసిందని గుర్తించింది. బిజెపి వాణిని ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లడంలో ఉదాసీనంగా వ్యవహరించడం, ఓట్ల శాతాన్ని గణనీయంగా తగ్గించిందిన విశ్లేషణలో వెల్లడైంది. లోక్‌సభ ఎన్నికలకు ముందే ఈ సమస్యలను అధిగమించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. పార్టీకి నష్టం కలిగించిన అంశాలను నియోజకవర్గాల వారీగా గుర్తించే పని మొదలుపెట్టారు. వీటి ఆధారంగా కొందరిపై చర్యలకు పార్టీ సిద్ధమవుతోంది. దీని ద్వారా పార్టీ అంకితభావంతో పనిచేసే వారికి ప్రాధాన్యం ఉంటుందనే సందేశం స్పష్టంగా పంపాలని నిర్ణయించింది. లోక్‌సభ ఎన్నికల్లో విజయాలు ఆ తర్వాత జరిగే పురపాలక, మండల పరిషత్, జడ్పీటీసి ఎన్నికలకు ఊపునిస్తాయని బిజెపి నేతలు విశ్లేషిస్తున్నారు.**

హైదరాబాద్, జనవరి 9 ప్రభాతవార్త : మళ్లీ రాజకీయ వేడి మొదలైంది. వీలైనన్ని లోక్‌సభ స్థానాలను తమ ఖాతాలో వేసుకోవడానికి బిజెపి అప్పుడే దృష్టి సారించింది. లోక్‌సభ ఎన్నికలకు బిజెపి ముందే సమాయత్నం అవుతోంది. వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో సత్తా చాటేందుకు ప్రయత్నిస్తున్న అగ్రనేతలంతా ఎన్నికల వ్యూహాల్లో ఇప్పటికే నిమగ్నమయ్యారు. లోక్‌సభ ఎన్నికల కార్యాచరణలో భాగంగా బిజెపి కీలకాంశాలపై దృష్టిసారించింది. అసెంబ్లీ ఎన్నికల్లో గుర్తించిన లోటు పాట్లను అధిగమించి ఎంపి స్థానాలు సాధించాలనే లక్ష్యంతో కార్యాచరణకు సిద్ధమవుతోంది. అభ్యర్థుల ప్రకటన కంటే ముందే ఎన్నికల ప్రచారానికి శ్రీకారం చుట్టాలని పార్టీ నిర్దేశించుకుంది. ఈ నేపథ్యంలో అయోధ్యలో రామమందిర నిర్మాణం అంశాన్ని బలంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని..రానున్న రోజుల్లో దీనిపైనే ప్రధాన దృష్టి సారించాలని నిర్ణయించారు. ఇప్పటికే వికసిత భారత్ పేరుతో కేంద్ర ప్రభుత్వం కార్యాక్రమాలపై ప్రత్యేక కార్యక్రమం అమలవుతోంది. కేంద్ర పథకాల లబ్ధిదారుల జాబితా ఆధారంగా ఇంటింటికి వెళ్లి ఓటర్లను కలిసేందుకు పార్టీ మరో ప్రణాళికను సిద్ధం చేస్తోంది. దళవారీగా ప్రచార కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్లాలని నిర్ణయించిన బిజెపి నాయకులు ప్రతి ఓటరును చేరుకునేలా పార్టీ అనుబంధ విభాగాలకు లక్ష్యాన్ని నిర్దేశించనున్నారు. కాగా, సిట్టింగ్ ఎంపి స్థానం సికింద్రాబాద్ నుంచి ఈసారి కూడా కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి బిజెపి నుంచి బరిలో ఉండే అవకాశాలు ఉన్నాయి. సికింద్రాబాద్ లోక్‌సభ నియోజక వర్గం పరిధిలో అంబర్‌పేట, ముషీరాబాద్, సనత్‌నగర్, సికింద్రాబాద్, నాంపల్లి, ఖైరతాబాద్, జూబ్లీహిల్స్ నియోజకవర్గాలు వస్తాయి. సికింద్రాబాద్ లోక్‌సభ ఎన్నికల్లో బిజెపి నుంచి రెండోసారి పోటీ చేసే అభ్యర్థి కేంద్ర మంత్రి, బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు జి.కిషన్‌రెడ్డి పేరు దాదాపు ఖరారైనట్లు తెలుస్తోంది. 2019లో జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో కిషన్‌రెడ్డి బిఆర్‌ఎస్ పార్టీపై 68వేల పైచిలుకు మెజార్టీతో విజయం సాధించారు.

నగర శివారు ప్రాంత లోక్‌సభ స్థానాల అభ్యర్థిత్వాల కోసం పలువురు పోటీ పడుతున్నారు. ఒత్తిళ్లకు తలొగ్గకుండా సర్వేల ఆధారంగా బలమైన అభ్యర్థులను గుర్తించాలని పార్టీ అగ్రనేతలు నిర్ణయించారు. మల్కాజ్‌గిరి పార్లమెంట్‌పై కన్నేసిన బిజెపి పలు వ్యూహాలను సిద్ధం చేసుకుంటోంది. ఇందులో భాగంగా ప్రధాని మోదీని కూడా ఇక్కడ నుంచి బరిలో దింపే ఆలోచనలో ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. గతంలో మహబూబ్‌నగర్ నుంచి ఆయన పోటీ చేస్తారని ఊహాగానాలు వెలువడగా తాజాగా ఆయన మల్కాజ్‌గిరి లేదా సికింద్రాబాద్ నుంచి పోటీ చేయవచ్చనే ప్రచారం సాగుతోంది. కాగా, మల్కాజ్‌గిరి స్థానానికి గట్టి పోటీ ఉంది. ఈ స్థానం నుంచి బిజెపి సీనియర్ నేత మురళీధర్‌రావుతోపాటు మాజీ మంత్రి ఈటల రాజేందర్, రాంచంద్రారావు పేరు కూడా వినిపిస్తున్నాయి. అలాగే మాజీ హోంమంత్రి టి.దేవేందర్‌గౌడ్ కుమారుడు వీరేందర్‌గౌడ్, మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్ తదితరులు పోటీపడుతున్నారు. ఇక్కడ అభ్యర్థి ఎంపికకు జాతీయ, రాష్ట్ర నాయకత్వాలు అత్యంత ప్రాధాన్యమిస్తున్నాయని ఒక సీనియర్ నాయకుడు తెలిపారు. నగరంతో ముడిపడి ఉండటంతో పాటు పలు అనుకులాంశాలు మల్కాజిగిరి లోక్‌సభ స్థానంలో బిజెపికి ఉన్నాయని, భవిష్యత్తుకు ఇది కీలక స్థానం అవుతుం దన్నారు.

హైదరాబాద్ లోక్‌సభ నుంచి ఎమ్మెల్యే రాజాసింగ్, భగవంతరావుల పేర్లను పరిశీలిస్తున్నట్లు తెలుస్తోంది. పలువురు పార్టీ సీనియర్ నేతలతో పాటు కొత్తవారు ఈ స్థానం నుంచి పోటీకి దింపే అవకాశాలు లేకపోలేదు.

## సాలార్‌జంగ్ మ్యూజియంలో రంగోలీ పోటీలు

చార్మినార్, జనవరి 9 ప్రభాతవార్త : సంక్రాంతి సందర్భంగా సాలార్ జంగ్ మ్యూజియంలో ఈ నెల 12వ తేదీన ఉదయం 11 గంటలు నుంచి మధ్యాహ్నం 1 వరకు రంగోలీ పోటీలను నిర్వహించనున్నట్లు మ్యూజియం అధికారులు వెల్లడించారు. గ్రూప్ వన్‌లో 12 నుంచి 20 సంవత్సరాలు లోపు వయస్సు గల మహిళలు, గ్రూప్ రెండులో ఇరవై సంవత్సరాలు పై బడిన మహిళలు ముగ్గుల పోటీలలో పాల్గొన వచ్చునని, విజేతలకు మొదటి బహుమతి 2000 రూపాయలు, ద్వితీయ బహుమతి 1500 రూపాయలు, తృతీయ బహుమతి 1000 రూపాయలు అందజేయనున్నామని అధికారులు తెలిపారు.

యూట్యూబ్ జ్యోతిష్యం రేపిన చిచ్చు

## గృహిణి ఆత్మహత్య



బాధితురాలు బబిత (ఫైల్‌ఫోటో)

అల్వాల్, జనవరి 9 ప్రభాతవార్త: యూట్యూబ్ జ్యోతిష్యం కుటుంబంలో విషాదాన్ని నింపింది. జ్యోతిష్యం పిచ్చిని వదులుకోవాలని భర్త అందరి ముందు బాధితురాలిని కొట్టడంతో మనస్తాపానికి గురై ఆత్మహత్యకు పాల్పడిన ఘటన అల్వాల్‌లో చోటు చేసుకుంది. ఆత్మహత్యకు సంబంధించి పోలీసులు, బాధితురాలి కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు ఈ విధంగా ఉన్నాయి. అంబర్‌పేట్ వాస్తవ్యులైన దంపతులు చందు, స్వరూప కుమార్తె బబిత(30)కు ఐదు సంవత్సరాలు క్రితం బాలంరాయికి చెందిన సాఫ్ట్‌వేర్ ఉద్యోగి రామక్రిష్ణ(31)తో వివాహం జరిపించారు. భార్యభర్తలు అల్వాల్ కానాజీగూడా ఇందిరానగర్‌లో కాపురం పెట్టగా వీరికి మూడేళ్ళ బాలుడు ఉన్నాడు. ఆదివారం కుమారుడి పుట్టిన రోజు వేడుకలు జరిగాయి. యూట్యూబ్‌లో జ్యోతిష్యం కథనాలు చూడడం ద్వారా బబిత అవే నిజమని నిర్ధారణకు వచ్చింది. తన జాతకం ప్రకారం భర్తతో విడి పోవడం ఖాయమనే నమ్మకానికి వచ్చింది. ఇదే విషయాన్ని పదే పదే భర్తతో చెప్పింది. కుమారుడ్డి పుట్టిన రోజున కూడా భర్తతో భవిష్యత్తులో విడిపోతామని చెప్పింది. కోపోద్రిక్తుడైన రామక్రిష్ణ అందరి ముందు భార్యను కొట్టాడు. సోమవారం ఉదయం కుమారుడు పాఠశాలకు, రామక్రిష్ణ ఉద్యోగానికి వెళ్ళాడు. మద్యాహ్నం పాఠశాల నుంచి ఇంటికి తిరిగి వచ్చిన కుమారుడు తల్లి సీలింగ్ ఫ్యాన్‌కు ఉరి వేసుకుని వేలాడుతూ ఉండడాన్ని గమనించాడు. ఇంటి కింద పోర్షన్‌లో ఉండే బాబాయి వద్దకు వెళ్ళి విషయాన్ని తెలిపాడు. బబితను కిందకి దించి ఆసుపత్రికి తరలించగా అప్పటికే ఆమె మరణించినట్లు వైద్యులు ధృవీకరించారు. యూట్యూబ్ జ్యోతిష్యాన్ని నమ్మి ఓ కుటుంబం చిన్నాభిన్నం కావడం స్థానికంగా విషాదాన్ని నింపింది. ఇదిలా ఉండగా ఆదనపు కట్నం వేదింపులు కారణంగా తమ కుమార్తె ఆత్మహత్యకు పాల్పడిందని బబిత తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

## ప్రజా పాలన దరఖాస్తుల తరలింపులో వివాదం

కుత్బుల్లాపూర్, జనవరి 9 ప్రభాతవార్త : ప్రజా పాలన దకఖాస్తుల కంప్యూటరీకరణ వివాదాస్పదంగా మారింది. కుత్బుల్లాపూర్ సర్కిల్‌కు సుమారు 70వేల దరఖాస్తులు రాగా వాటిని కంప్యూటరీకరించేందుకు అధికార యంత్రాంగం పనులను ప్రారంభించింది. అయితే కుత్బుల్లాపూర్ సర్కిల్ కార్యాలయంలో వై-ఫై మొరాయించడంతో వార్డు కార్యాలయానికి తరలించేందుకు ఏజెన్సీలు యత్నించాయి. అయితే దరఖాస్తులను తరలిస్తున్నారన్న పుకార్లు షికార్లు చేయడంతో ఏకంగా కుత్బుల్లాపూర్ సర్కిల్ కార్యాలయం వద్ద తీవ్ర ఆందోళన చోటుచేసుకుంది. దరఖాస్తుల తరలింపులో పారదర్శకత లోపించిందంటూ దుమారం చోటుచేసుకోవడంతో సర్కిల్ లోని వివిధ ఉన్నతాధికారులు ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించి పరిస్థితిని సమీక్షించినట్లు సమాచారం. అయితే దరఖాస్తులు ఎక్కడ పడిపోలేదని సర్కిల్ కార్యాలయంలో వై-ఫై సరిగా పనిచేయకపోవడంతో వార్డు కార్యాలయాలకు తరలించేందుకు మాత్రమే ఏజెన్సి నిర్వాహకులు యత్నించారని తెలిసింది.

## రోడ్డుపై స్పృహతప్పి పడిపోయిన మహిళ.. 108సహాయంతో చికిత్స



కుత్బుల్లాపూర్, జనవరి 9 ప్రబాతవార్త : గుర్తు తెలియని మహిళ రోడ్డుపై పడిపోవడంతో కంగా రు పడపోయిన స్థానికులు 108కి సమాచారం అం దించడంతో పోలీసులు, అంబులెన్స్ సకారంలో చేరుకుని ఆమెకు వైద్య పరీక్షలు నిర్వహించారు. స్పృహలోకి వచ్చిన తరువాత విచారించగా ఆమె ఇళ్లవద్ద బిక్షాటన చేస్తుందని తిరిగితిరిగి కళ్లతిరిగి పడిపోయిందని నిర్ధారించి ఊపిరిపీల్చుకున్నారు.

## సంక్రాంతికి సొంత ఊళ్లకు

ఖైరతాబాద్, జనవరి 9 ప్రభాతవార్త: సంక్రాంతి పర్వ దినమైన పండుగకు సొంత ఊళ్లకు వెళ్లేందుకు సిద్ధమవుతున్నారు. విద్యార్థులకు ఈ నెల 12 నుంచి 17 వరకు సెలవులు రావడంతో కుటుంబ సమేతంగా సొంత బోగి, సంక్రాంతి, కనుమ పండుగలను సొంత ఊళ్లలో అధిక ప్రాధాన్యత ఉంటుందని వారు అంటున్నారు. ఊళ్లలో ఖాళీ ప్రదేశాలు, పచ్చగా ఉండే వాతావరణం తదితర వంటివి బాగుంటాయని సొంత ఊళ్లకు పయనం అయ్యే వారు చెబుతున్నారు. యువత, మహిళలు ఎంతో జోష్‌గా పతంగులు ఎగురవేయడం, పోటీలు పడడం వంటివి ఉంటాయంటున్నారు. సంక్రాంతి పండుగను సొంతూళ్లలో ఎవరి పని వారిదన్నట్లు మూడు రోజుల పాటు సంతోషంగా గడుపనున్నారు.

## క్యాలెండర్ ఆవిష్కరణ



బేగంబజార్, జనవరి 9 ప్రభాతవార్త: తెలంగాణ నాన్ గజిటెడ్ వాణిజ్య పన్నులశాఖ కేంద్ర సంఘం ఆద్వర్యంలో అబిడ్స్ డివిజన్ రూపొందించిన క్యాలెండర్‌ను వాణిజ్య పన్నులశాఖ జాయింట్ కమీషనర్ లావణ్య ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో టి.సి.టి.ఎన్.జి.ఓ.సి.ఎ రాష్ట్ర అద్యక్షులు రావుల ప్రదీప్‌కుమార్‌రెడి ,ప్రధాన కార్యదర్శి మహ్మద్ రహమత్‌అలీ,అబిడ్స్ డివిజన్ అధ్యక్షులు సయ్యద్‌ఖాన్, కార్యదర్శి బషీరుద్దీన్‌ఖాద్రీ,సహా అధ్యక్షులు రంగస్వామి, కోశాధికారి బెనర్జీ,రాష్ట్ర సహా అధ్యక్షులు హరిప్రసాద్,కోశాధికారి దేవులపల్లి శ్రీనివాస్‌రావు, ఉపాధ్యక్షులు మధు, ప్రభాకర్,శ్రీరామ్ తదితరులు పాల్గొన్నారు.

## నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

నిజాంపేట్, జనవరి 9, ప్రభాతవార్త : కొత్తగా ప్రతిపాదించిన గోకుల్ నిర్మాణ ఫీడర్‌పై స్తంభాల ఏర్పాటు కోసం 11 కెవి వెంకటసాయి ఫీడర్, 33/11 కెవి నిజాంపేట ఎస్ఎస్ నుండి వెలువడే 11 కెవి భవ్యాస్ ఫీడర్‌లపై నేడు ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం 12.30 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు నిజాంపేట్ విద్యుత్ ఏఈ తెలిపారు.

## సిఎంకు ఆహ్వాన పత్రిక



ఎస్.సి.ఆర్.ఎంప్లాయిఎస్ సంఘ్ సమావేశానికి హాజరు కావాలని సిఎం రేవంత్ రెడ్డికి ఆహ్వాన పత్రికను అందజేస్తున్న నేతలు భరణి భానుప్రసాద్, ఆదం సంతోష్ తదితరులు

కంటోన్మెంట్,జనవరి 9 ప్రభాతవార్త: దక్షిణ మధ్య రైల్వే ఎంప్లాయిస్ సంఘ్ ఆధ్వర్యంలో ఈ నెల 17,18 తేదీల్లో నిర్వహించనున్న జనరల్ బాడీ సమావేశానికి హాజరు కావాలని కోరుతూ సంఘ్ నేతలు ఆదం సంతోష్ కుమార్, ఎం.భరణి భానుప్రసాద్‌లు రాష్ట్ర ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డికి ఆహ్వాన పత్రికను అందజేశారు. ఈ కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఆదం సృజన్‌కుమార్ పాల్గొన్నారు.

## అడ్డగుట్ట యూపిహెచ్‌సిలో ముగ్గుల పోటీలు



అడ్డగుట్ట ప్రభుత్వ ఆసుపత్రిలో ఆశా వర్కర్లకు ముగ్గుల పోటీలు నిర్వహించిన దృశ్యం

అడ్డగుట్ట, జనవరి 9 ప్రభాతవార్త: సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకొని మంగళవారం అడ్డగుట్టలోని యూపిహెచ్‌సిలో ఆశా వర్కర్లకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎస్.పి.హెచ్.ఓ.డాక్టర్ రాజశ్రీ, అడ్డగుట్ట మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సాయిశంకర్‌లు పాల్గొని ముగ్గుల పోటీల్లో పాల్గొన్న ఆశా వర్కర్లను అభినందించారు.

## సమాజ సేవకు అందరూ ముందుకు రావాలి: ఎమ్మెల్యే



శ్రీకుమార్‌కు చెక్కును అందజేస్తున్న కాలేరు

హైదరాబాద్, జనవరి 9 ప్రభాతవార్త: నిరుపేదల దహన సంస్కారానికి అండగా నిలుస్తూ, తాను నిర్వహిస్తున్న విలక్షణ సమాజ సేవలో భాగంగా మంగళవారం నాడిక్కడ అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ 35 మందికి సంబంధించిన 1,57,500 రూపాయల చెక్కును హిందూ స్మశాన వాటికి కార్యదర్శి శ్రీకుమార్‌కు అందజేయడం జరిగింది. సమాజ సేవకు అందరు ముందుకు రావాలని ఎమ్మెల్యే కోరారు.



మృతి చెందిన కానిస్టేబుల్ భార్యకు నగదును అందజేస్తున్న పహాడీషరీఫ్ పోలీసులు

## నూతన ఇన్‌స్పెక్టర్‌ను కలిసిన బిఆర్ఎస్ నేతలు

అల్వాల్, జనవరి 9 ప్రభాతవార్త: అల్వాల్ పోలీసు స్టేషన్ నూతన ఇన్‌స్పెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన రాహుల్ దేవ్‌ను బిఆర్ఎస్ నేతలు మంగళవారం మర్యాద పూర్వకంగా కలిశారు. శాంతి భద్రతలు పరిరక్షణలో సహకరించాలని ఈ సందర్భంగా సిఐ నేతలను కోరారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నేతలు డోలి రమేష్, ఆతీక్ పాషా, శోభన్, ప్రశాంత్ రెడ్డి, పవన్, రమేష్ రెడ్డి, శ్రీనివాస్, రవీందర్ రెడ్డి, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## కట్టుదిట్టంగా పారిశుధ్య నిర్వహణ



సమీక్షా సమావేశంలో సిబ్బంది

అల్వాల్, జనవరి 9 ప్రభాతవార్త: ప్రజారోగ్యానికి సంబంధించి ఎటువంటి ఆలసత్వానికి తావు ఇవ్వరాదని అల్వాల్ సర్కిల్ డిసి శ్రీనివాస్ రెడ్డి అధికారులను ఆదేశించారు. మంగళవారం సర్కిల్ కార్యాలయంలో పారిశుధ్య విభాగం పని తీరుపై డిసి సమీక్ష నిర్వహించారు. స్వచ్ఛ సర్వేక్షణ్‌లో జిహెచ్‌ఎంసి ఉత్తమమైన స్థానం సాధించిన నేపధ్యంలో భవిష్యత్తులోనూ ఇదే తీరును కొనసాగించాలని కోరారు. ఇటీవల కొంత కాలంగా పారిశుధ్యం లోపాలు పలు ప్రాంతాలులో వెలుగులోకి వచ్చాయన్నారు. స్థానిక ఎమ్మెల్యేతో పాటుగా కాలనీ సంక్షేమ సంఘాలకు చెందిన ప్రతినిధులు ఫిర్యాదులు చేశారని వివరించారు. లోపాలను సరిదిద్దుకోవాలని లేని పక్షంలో శాఖా పరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆరోగ్యశాఖతో పారిశుధ్య విభాగం సమన్వయం చేసుకోవాలని కోరారు. కార్మికుల హాజరు పట్ల కఠినంగా ఉండాలని సూచించారు. ఈ సమావేశంలో ఎఎంహెచ్‌ఓ మంజుల, శానిటరీ సూపర్‌వైజర్ ప్రభాకర్ ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

## కల్తీ రహిత రాష్ట్రంగా తెలంగాణాను తీర్చిదిద్దాలి

**వినయ్ కిషోర్‌యాదవ్**



సమావేశంలో మాట్లాడుతున్న వినయ్‌కిషోర్‌యాదవ్

సైఫాబాద్, జనవరి 9 ప్రభాతవార్త: ప్రపంచంలోనే అగ్రగామిగా అభివృద్ధి చెందుతున్న తెలంగాణ రాష్ట్రాన్ని కల్తీ రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దేందుకు రాష్ట్ర ప్రభుత్వం తగు చర్యలు చేపట్టాలని స్వాభిమాన్ పరిషత్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు కె.వినయ్‌కిషోర్‌యాదవ్ డిమాండ్ చేశారు. కల్తీలేని ఆహారపదార్థాల నిషేదం కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్వచ్ఛంద సంస్థలతో ఒక కమిటిని ఏర్పాటు చేసి కల్తీ నిరోధానికి కృషి చేయాలని కోరారు. మంగళవారం నాడిక్కడ ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ నేషనల్ క్రైమ్ రికార్డ్ బ్యూరో (ఎన్‌సిఆర్‌డి) లెక్కల ప్రకారం దేశంలోని 19 ముఖ్య నగరాల్లో కల్తీ ఆహార పదార్థాలపై 291 కేసులు నమోదు కాగా ఇందులో 246 కేసులు హైదరాబాద్‌లోనే నమోదు అయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు. సాంకేతిక రంగంలో దూసుకుపోతున్న హైదరాబాద్ నగరంలో అన్ని కల్తీతో కూడిన ఆహార పదార్థాలే ఎక్కడ చూసినా దర్శనమిస్తున్నాయని, దేశభవిష్యత్తును తీర్చిదిద్దే నేటి యువతీ యువకులు అర్థాయుషతనే వారి జీవితాలు ముగుస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో పరిషత్ ప్రతినిధులు, న్యాయవాదులు సిరిగిరి ప్రభాకర్, పి.ప్రమోద్, రాజేష్, వెంకటేష్, అనుప్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులు పోటీతత్వం.. క్రమశిక్షణతో విద్యనభ్యసించాలి : అధ్యక్షులు పంకజ్ గుప్తా



కళాశాల విద్యార్థులతో బిజినెస్ ఎంబీఏ మేనేజ్మెంట్ ఉపాధ్యాయులు

తార్నాక, జనవరి 9 ప్రభాతవార్త: విద్యార్థులు పోటీతత్వం.. .క్రమశిక్షణతో విద్యనభ్యసించి ఒ.యూకు తల్లితండ్రులకు పేరుతీసుకు రావాలని రౌండ్ టేబుల్ ఇంటర్నేషనల్ అధ్యక్షులు పంకజ్ గుప్తా సూచించారు. ఒ.యూలోని డిపార్ట్‌మెంట్ ఆఫ్ బిజినెస్ మేనేజ్మెంట్ కళాశాలలో మంగళవారం సందడిగా ఫ్రెషర్స్ పార్టీ నిర్వహించారు. ఎస్ప్రరాంజ అనే పేరుతో నిర్వహించిన ఈ వేడుకకు సీనియర్, జూనియర్ విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని సందడి చేసి వివిధ సాంస్కృతిక కార్యక్రమాలతో అలరించారు. ఈ వేడుకకు పూర్వ విద్యార్థి పంకజ్ గుప్తా, యూఎస్ నుంచి వచ్చిన పలువురు పూర్వవిద్యార్థులు హాజరై వారు ఎదుర్కొంటున్న సమస్యలు, అనుభవాలను విద్యార్థులకు చెప్పి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల యూసీసీ అండ్ బీఎం హెడ్ అండ్ ప్రిన్సిపల్ ప్రొ. డి.శ్రీరాములు స్వాగతోపన్యాసం చేసి విద్యార్థులకు వ్యక్తలను పరిచయం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంబీఏ రెగ్యూలర్, ఎంబీఏ టిఎం, బీబీఏ టీటీఎం విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ఏఐఎన్‌యులో వెయ్యి రోబోటిక్ సర్జరీలు

హైదరాబాద్, జనవరి 9,ప్రభాతవార్త: ఏషియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ నెఫ్రాలజీ అండ్ యూరాలజీ (ఏఐఎన్‌యూ )మరోఘనత సాధించింది. యూరాలజీ, యూరో - అంకాలజీ ,నెఫ్రాలజీ విభాగాల్లో వెయ్యి రోబోటిక్ సర్జరీలను విజయవంతంగా పూర్తి చేసినట్లు ప్రకటించింది. ఈమేరకు మంగళవారం సోమాజిగూడలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఏఐఎన్‌యూ ఎండీ డాక్టర్ సి.మల్లికార్జున, డైరెక్టర్ డాక్టర్ పిసిరెడ్డిలు మాట్లాడారు.ఈసందర్భంగా వారుమాట్లాడుతూ ఏఐఎన్‌యూలో రోబోటిక్ సర్జరీ ప్రోగ్రాం ..అత్యంత నైపుణ్యం కలిగిన సర్జన్ల, అత్యాధునిక అసిస్టెడ్ సర్జికల్ సిస్టం సమ్మిళితంగా ఉంటుందన్నారు. ఈవిధానం వల్ల చికిత్స సమయంలో మరింత ఖచ్చితత్వం, నైపుణ్యం, విజువలైజేషన్ వస్తాయన్నారు. సాధరణ శస్త్రచికిత్స చేయించుకునే రోగులకు తమ పనులు తిరిగి మొదలుపెట్టేందుకు ఎక్కువ కాలం విశ్రాంతి అవవసరమని ,కానీ రోబోటిక్ శస్రచికిత్స చేయించుకునే వారు త్వరగా కోలుకుంటారన్నారు. అలాగే రోబోల వాడకం పెరగడం వల్ల రోగులకు ఖర్చు కూడా గణనీయంగా తగ్గుతుందని వారు పేర్కొన్నారు.

## రెవెన్యూ వ్యవస్థపై పట్టు ఉన్న వ్యక్తి సీసీఎల్‌ఏ డైరెక్టర్ పదవి చేపట్టడం శుభపరిణామం

వీఆర్ఏ హక్కుల సాధన సమితి ఛైర్మన్ ఆర్.విజయ్



సీఎంఆర్వో ప్రాజెక్ట్ డైరెక్టర్ వి.లచ్చిరెడ్డిని సత్కరిస్తున్న వీఆర్ఏ హక్కుల సాధన సమితి ఛైర్మన్ ఆర్.విజయ్

ముషీరాబాద్, జనవరి 9, ప్రభాత వార్త: రెవెన్యూ వ్యవస్థపై పట్టు ఉన్న లచ్చిరెడ్డికి సీఎంఆర్వో ప్రాజెక్ట్ డైరెక్టర్ (సిసిఎల్‌ఏ) బాద్యతలు అప్పగించటం శుభపరిణామమని వీఆర్ఏ హక్కుల సాధన సమితి ఛైర్మన్ ఆర్.విజయ్ అన్నారు. మంగళవారం సీసీఎల్‌ఏ డైరెక్టర్‌గా నూతనంగా బాద్యతలు చేపట్టిన లచ్చిరెడ్డిని వీఆర్ఏ హక్కుల సాధన సమితి ఆధ్వర్యంలో కలిసి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా విజయ్ మాట్లాడుతూ రెవెన్యూ వ్యవస్త బలోపేతానికి సీఎం రేవంత్‌రెడ్డి తీసుకున్న నిర్ణయం అభినందనీయమని కొనియాడారు. సీఎం నిర్ణయంతో రాష్ట్రంలోని రైతులందరికీ న్యాయం జరుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో వీఆర్ఏ హక్కుల సాధన సమితి నాయకులు సత్యనారాయణ, సతీష్, చిరంజీవి, అశోక్, శివరాం పాల్గొన్నారు.

## సంక్రాంతి తరువాత ఆటోడ్రైవర్లతో చర్చలు

**మంత్రి పొన్నం ప్రభాకర్**



మంత్రి పొన్నం ప్రభాకర్‌కు వినతి పత్రాన్ని అందజేస్తున్న ఆటో సంఘాల నాయకులు

సైఫాబాద్, జనవరి 9 ప్రభాతవార్త: కేవలం శ్రమశక్తిపై ఆధారపడి జీవనం కొనసాగిస్తున్న ఆటో డ్రైవర్లను ప్రభుత్వం తక్షణమే అదుకోవాలని అఖిల భారత అసంఘటిత కార్మికులు, ఉద్యోగుల కాంగ్రెస్ (కెకెసి) ఛైర్మన్ కౌషల్‌సమీర్ విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు మంగళవారం రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌ను కెకెసి ఛైర్మన్ కౌషల్‌సమీర్ ఆధ్వర్యంలో ఐఎన్‌టియుసి నాయకులు మంత్రి నివాసంలో కలిసి వినతి పత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా మంత్రి ప్రభాకర్ మాట్లాడుతూ ఎన్నికల హామీలో భాగంగా రాష్ట్రంలోని మహిళలకు ఉచిత బస్‌ప్రయాణం కల్పించడం జరిగిందన్నారు. దీంతో కొన్ని ప్రతిపక్ష ఆటో సంఘాలు కావాలని రాద్ధాంతం చేస్తున్నాయని విమర్శించారు. గత దశాబ్ధ కాలంలో బిఆర్ఎస్ ప్రభుత్వం ఆటో డ్రైవర్ల అభివృద్ధి, సంక్షేమానికి ఎం చేసిందో చెప్పాలని మంత్రి డిమాండ్ చేశారు. ఇప్పటికైన ప్రతిపక్షాలు ప్రభుత్వంపైన లేనిపోని ఆరోపణలు చేయడం మానుకోవాలని, ఆటో డ్రైవర్లను రెచ్చగోట్టవద్దని సూచించారు. ప్రతిపక్ష ఆటో డ్రైవర్ల సంఘాలు చెప్పె మాటలు నమ్మవద్దని ఆటో డ్రైవర్ల సంక్షేమం, అభివృద్ధికి సిఎం ఎ.రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. సంక్రాంతి తరువాత ఆటో డ్రైవర్ల సమస్యలను అన్ని సంఘాలతో చర్చించి సమస్యలను పరిష్కారిస్తామని మంత్రి హామీ ఇచ్చారని ఛైర్మన్ తెలిపారు. మంత్రిని కలిసిన వారిలో కెకెసి వైస్-ఛైర్మన్ వేణు, ప్రధాన కార్యదర్శి పింగిలి సంపత్‌రెడ్డి, ఆటో విభాగం ప్రధాన కార్యదర్శి రుద్రాక్ష మల్లేష్, ఐఎన్‌టియుసి నాయకులు నర్సింహ్మారెడ్డి, గోదా మల్లేష్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## బిల్కిన్ బాను కేసులో సుప్రీంకోర్టు నిర్ణయింపై హర్షం వ్యక్తం చేసిన లోక్‌దళ్

సైఫాబాద్, జనవరి 9 ప్రభాతవార్త: బిల్కిన్ బానో కేసులో గుజరాత్ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని సుప్రీంకోర్టు తీసుకున్న నిర్ణయం పట్ల భారత జాతీయ లోక్‌దళ్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పి.వెంకటరాజేశ్వర్‌రావు హర్షం వ్యక్త చేశారు. దేశవ్యాప్తంగా సంచనం సృష్టించిన బిల్కిన్ బానో సామూహిక అత్యాచారం, ఆమె కుటుంబంలో 7 గురు దారుణ హత్య కేసులో 11 మంది దోషులకు విధించిన శిక్షను తగ్గిస్తూ గుజరాత్ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయింపై సుప్రీంకోర్టు తీవ్రంగా తప్పు పట్టడం చారిత్రాత్మకమైన నిర్ణయమన్నారు. ఈ నిర్ణయం గుజరాత్ ప్రభుత్వానికి చెంపపెట్టువంటిదని ఆయన హెచ్చరించారు. భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు తిరిగి పునావృత్తం కాకుండా చూడాల్సిన అవసరం ఉందని, సుప్రీంకోర్టు నిర్ణయం అందరికి సమాన న్యాయం లభిస్తుందన్న భరోసాను ఇచ్చిందన్నారు.

## ముఖ్యమంత్రిని కలిసి శుభాకాంక్షలు తెలిపిన ఆదం సంతోష్ కుమార్

సికింద్రాబాద్, జనవరి 9 ప్రభాతవార్త: హైదరాబాద్ జిల్లాలోని నియోజకవర్గాల్లో గత డిసెంబర్‌లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసిన కాంగ్రెస్ అభ్యర్థులతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జరిపిన రివ్యూ సమావేశంలో పాల్గొన్న అనంతరం సికింద్రాబాద్ కంటెస్టెడ్ ఎమ్మెల్యే ఆదం సంతోష్ కుమార్ ముఖ్యమంత్రిని కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

## మెరుగైన వైద్యం అందించేందుకు ఉచితవైద్య శిబిరం



పిఆర్‌నగర్‌లోని నీలిమ ఆసుపత్రి వద్ద ఉచిత వైద్య శిభిరంలో పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

యూసుఫ్‌గూడ, జనవరి 9, ప్రభాతవార్త : పేదలకు మెరుగైన వైద్యం అందించేందుకు గాను ఉచిత వైద్య శిభిరం నిర్వహిస్తున్నట్లు డాక్టర్.నీలిమా శ్రీనువాస్ అన్నారు. మంగళవారం పిఆర్‌నగర్‌లో నీలిమ ఆసుపత్రి వద్ద నీలిమా 9పేరుతో ఉచిత వైద్య శిభిరం నిర్వహించారు. ప్రతి నెల 9వ తేదీన గర్భినీలకు ఉచిత వైద్య శిభిరాన్ని నిర్వహించి వారికి ఉచితంగా పరీక్షలు నిర్వహించడంతో పాటు మందులను అందజేయడం జరుగుతుందని పేర్కొన్నారు.

## బిజెపి తెలంగాణ శాఖ ఎండోమెంట్ సెల్ కన్వీనర్‌గా సూర్య ప్రకాష్ అన్నా వజ్జుల



హైదరాబాద్, జనవరి 9 ప్రభాతవార్త: భారతీయ జెనతా పార్టీ తెలంగాణ శాఖ ఎండోమెంట్ సెల్ కన్వీనర్‌గా సూర్య ప్రకాష్ అన్నా వజ్జుల నియమితులయ్యారు. ఈ మేరకు పార్టీ ప్రధాన కార్యదర్శి గుజ్జుల ప్రేమేందర్ రెడ్డి నియామక పత్రాన్ని రాష్ట్ర కార్యాలయంలో సూర్యప్రకాష్‌కు అందజేశారు. మహబూబ్‌నగర్ జిల్లాకు పాలకుర్తి నియోజకవర్గం నరసింహులు పేటకు చెందిన ఈయన సామాజిక కార్యకర్తగా ఎన్నో దేవాలయాలు, వృద్ధాశ్రమాలు, కళ్యాణ మంటపాలు నిర్మించారు. బిజేపీలో సీనియర్ నాయకుడిగా ఉన్న సూర్యప్రకాష్‌కు పార్టీ గుర్తించి కొత్త భాద్యతలను అప్పగించింది. తెలంగాణ రాష్ట్ర ఎండోమెంట్ సెల్ కన్వీనర్‌గా భాద్యతలను ప్రజల సహకారంతో విజవంతంగా నిర్వహిస్తానని చెప్పారు. తనపై విశ్వాసం ఉంచి పదవీ భాద్యతలు ఇచ్చిన రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి, డా.లక్ష్మణ్, బండి సంజయ్, ఎన్.రాంచందర్‌రావు, ఎన్‌వీఎస్ఎస్ ప్రభాకర్, ఎన్.వి.సుభాష్, గీతా మూర్తిలకు కృతజ్ఞతలు చెప్పారు.

## అంధుల అక్షరశిల్పి లూయిస్ బ్రెయిలీ

**సీబీఐ కోర్టు పూర్వ న్యాయమూర్తి జస్టిస్ నాగమారుతిశర్మ**



సీబీఐ కోర్టు పూర్వ న్యాయమూర్తి జస్టిస్ నాగమారుతిశర్మ

చిక్కడపల్లి, జనవరి 9 ప్రభాతవార్త: అంధుల అక్షరశిల్పి లూయిస్ బ్రెయిలీ అని సీబీఐ కోర్టు పూర్వ న్యాయమూర్తి జస్టిస్ నాగమారుతిశర్మ అన్నారు. శతాబ్దిపూర్వ మహనీయుల యాదిలో కార్యక్రమం మంగళవారం చిక్కడపల్లి శ్రీ త్యాగరాయ గానసభలోని కళాసుబ్బారావు కళావేదికలో లూయిస్ బ్రెయిల్ జయంతి సభ గానసభ అధ్యక్షుడు కళావిఎస్.జనార్ధనమూర్తి అధ్యక్షతన జరిగింది. ఈసందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన జస్టిస్ నాగమారుతిశర్మ హాజరై బ్రెయిలీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించి ప్రసంగించారు. పట్టుదలకు మారుపేరుగా, కఠన శ్రమకు, ఆదర్శ జీవితాలకు వన్నెలద్దిన వ్యక్తి, వైకల్యాన్ని జయించి, అనుకున్న పనిని సాధించిన మహనీయుడు అని అన్నారు. అంధుల అక్షర ప్రదాత అని అన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర వికలాంగుల పరిరక్షణ సమితి అధినేత కొల్లి నాగేశ్వరరావు,నగర వికలాంగుల సంస్థ అధ్యక్షుడు శంకర్, తెలంగాణ రాష్ట్ర వికలాంగుల పరిరక్షణ సమితి రాష్ట్ర కార్యవర్గసభ్యుడు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## పార్కులో అసాంఘిక కార్యక్రమాలకు అడ్డుకట్ట వేయాలి

**కమ్యూనిటీహాల్ తాళాలు తెరువాలని వినతి**



మణికొండలోని డైమండ్‌హిల్స్ పార్కు వద్ద ఆందోళన చేస్తున్న స్థానికులు

నార్సింగి, జనవరి 9 ప్రబాతవార్త : మణికొండ మున్సిపల్ పరిధిలోని డైమండ్‌హిల్స్‌లో ఉన్న పార్కులో జరుగుతున్న అక్రమ కార్యకలాలకు అడ్డుకట్ట వేయాలని స్థానికులు ఆందోళన నిర్వహించారు. అలాగే ప్రజల సౌకర్యార్థం నిర్మించిన కమ్యూనిటీహాల్‌కు తాళాలు తీయాలని కోరుతూ మున్సిపల్ కమీషనర్, నార్సింగి పోలీసులకు డైమండ్‌హిల్స్ కాలనీ ప్రజలు ఫిర్యాదులు చేశారు. ఇటీవల ఈ పార్కులో ఆకతాయిలు వచ్చి ఇష్టానుసారంగా ప్రవర్తిస్తున్నారని, మద్యం తాగి సీసాలు పగులగొడుతున్నారన్నారు. పార్కులో చిన్నారులు ఆడుకునేందుకు, పెద్దలు వాకింగ్ చేసేందుకు మరిన్ని సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. మున్సిపల్ అధికారులు వచ్చి కమ్యూనిటీ హాల్‌కు తాళాలు వేసుకున్నారని, మా కాలనీ వాసులకు అందుబాటులో ఉన్న ఈ కమ్యూనిటీహాల్‌కు తాళాలు వేయకూడదని ఎంత వేడుకున్నా వారు వినడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయంలో మున్సిపల్ అధికారులుగాని, ప్రజాప్రతినిధులుగాని స్పందించి పార్కులోకి ఆకతాయిల రాకను అడ్డుకోవాలని, కమ్యూనిటీహాల్ తాళాలు తెరిపించాలని డైమండ్‌హిల్స్ కాలనీ ప్రతినిధులు రత్నకుమార్, యం.వి.చౌదరి, చంద్రమౌళి, శివరామకృష్ణ, వినీల్, తులసీ, శిరీష, వివేక్ తదితరులు డిమాండ్ చేశారు.

## దేవాదాయ శాఖ ట్రైబ్యునల్ ఆదేశాల మేరకు చిక్కడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయం ఆవరణలో షాపులు ఖాళీ

చిక్కడపల్లి, జనవరి 9 ప్రభాతవార్త: రాష్ట్ర దేవాదాయ ధర్మాదాయ శాఖ ట్రైబ్యునల్ కోర్టు ఆదేశాల మేరకు చిక్కడపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామి దేవాలయానికి సంబంధించిన షాపులను ఆక్రమణలను మంగళవారం అధికారులు తొలగించి స్వాధీనం చేసుకున్నారు. దేవాదాయ ధర్మాదాయ శాఖ సహాయ కమిషనర్ బాలాజీ, ఇన్‌స్పెక్టర్‌లు సురేఖ, కె.సురేందర్ పర్యవేక్షణలో ఆశాఖ సిబ్బంది షాపులను ఖాళీ చేయించారు. ఈ సందర్భంగా అధికారులు బాలాజీ, సురేఖ మాట్లాడుతూ దేవాదాయ ధర్మాదాయ శాఖకు సంబంధించిన ఆరు షాపులున్నాయని, ఇందులో నలుగురు షాపు నిర్వాహకులు అద్దె చెల్లించకపోవడంతో బకాయిలు విపరీతంగా పెరిగిపోయాయని, గత కొన్ని సంవత్సరాల నుంచి ఎండోమెంట్ ట్రైబ్యునల్ కేసు నడుస్తుండగా చివరక మంగళవారం కోర్టు న్యాయమూర్తి తుది తీర్పును వెలువరిస్తూ వెంటనే షాపులను ఖాళీ చేయాలని తీర్పు వెలువరించారు.



జూ పార్కులో మొక్కలు నాటుతున్న డెల్ టెక్నాలజీస్ సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు

## పేదలకు అన్నివేళల వైద్య సేవలు అందించాలి



పర్వత్‌నగర్ యుపిహెచ్‌సి సెంటర్‌లో నూతనంగా బాధ్యతలు చేపట్టిన డాక్టర్ శాలినిని అభినందిస్తున్న కార్పోరేటర్ సబీహాగౌసుద్దీన్

యూసుఫ్‌గూడ, జనవరి 9, ప్రభాతవార్త : అత్యధికంగా పేదలు నివసించే బస్తీ పర్వత్‌నగర్ అనీ పేదలకు అన్ని వేళల అందుబాటులో ఉంటూ వారికి వైద్యులు సేవలు అందించాలని కార్పోరేటర్ సబీహాగౌసుద్దీన్ అన్నారు. మంగళవారం పర్వత్‌నగర్ యుపిహెచ్‌సి సెంటర్‌లో నూతనంగా పదవి బాధ్యతలు చేపట్టిన డాక్టర్ శాలినిని కార్పోరేటర్ సత్కరించారు. అనంతరం ఆసుపత్రిలో నెలకొన్న పలు సమస్యలను పరిష్కరించే దిశగా ఎన్ ఆరోగ్య సమితి కమీటి మీటింగ్ ఏర్పాటు చేశారు.ఆసుపత్రిలో రోగులకు సరైన విధంగా మంచినీటి సదుపాయం లేదని రాత్రి పూట వాచ్‌మెన్ ఏర్పాటు చేయాలని అదేవిధంగా రాత్రి పూట ఆసుపత్రికి వచ్చే రోగులకు అందుబాటులో ఉండేవిధంగా స్టాఫ్ నర్సును నియమించాలని ఏదైన ప్రమాదం జరిగితే వారిని తీసుకువచ్చేందుకు ఆంబులెన్సును ఏర్పాటు చేయాలని తెలిపారు.అందుకు కార్పోరేటర్ వెంటనే స్పందించి తమ దృష్టికి వచ్చిన సమస్యలన్నింటిని స్థానిక ఎమ్మెల్యే మాదవరం కృష్ణారావు దృష్టికి తీసుకువెళ్ళేల సమస్యలు పూర్తి స్థాయిలో పరిష్కారం అయ్యేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఈకార్యక్రమంలో లింగాల ఆయిలయ్య, భక్తి సంక్షేమ సంఘం అధ్యక్షులు జాహెద్ షరీఫ్, వీరారెడ్డి, టీఆర్ఎస్ రాజు, శంకర్ గంగపుత్ర, యోగిరాజు స్వామి, పార్వతమ్మ, లక్ష్మీ, రవిందర్‌రెడ్డి, సంజీవరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## నాదర్‌గుల్‌లో దివ్యాంగుల భవనాన్ని ప్రారంభం : ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి



దివ్యాంగుల భవనాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి తదితరులు

**సరూర్‌నగర్, జనవరి 9 ప్రభాతవార్త:** మహేశ్వరం నియోజకవర్గం బడంగ్‌పేట్ కార్పొరేషన్ పరిధిలోని 27వ డివిజన్ నాదర్‌గుల్‌లో నూతనంగా నిర్మించిన దివ్యాంగుల భవనం మంగళవారం ప్రారంభమైంది. స్థానిక మర్రి లక్ష్మమ్మ వెంచర్‌లో రూ.25 లక్షల సిడిపి నిధులతో నిర్మించిన ఈ దివ్యాంగుల భవనాన్ని మంగళవారం సాయంత్రం జరిగిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మహేశ్వరం ఎమ్మెల్యే పట్లోళ్ళ సబితా ఇంద్రారెడ్డి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మేయర్ చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి, కమీషనర్ బదుగు సుమన్‌రావు, స్థానిక కార్పొరేటర్, కార్పొరేషన్ బిజెపి ఫ్లోర్ లీడర్ తోట శ్రీధర్‌రెడ్డి, కో-ఆప్షన్ సభ్యుడు మర్రి జగన్మోహన్‌రెడ్డి, భాగ్యనగర్ సొసైటీ ఛైర్మన్ మర్రి నర్సింహారెడ్డి, డైరెక్టర్ యెల్చల సుదర్శన్‌రెడ్డితో పాటు కార్పొరేషన్ బిఆర్ఎస్ ఫ్లోర్ లీడర్ సూర్ణగంటి అర్జున్, వివిధ డివిజన్ల కార్పొరేటర్లు బొద్రమోని రోహిణి రమేష్ ముదిరాజ్, పెద్దబావి సుదర్శన్‌రెడ్డి, పెద్దబావి శ్రీనివాస్‌రెడ్డి, మాజీ ఎంపిటిసి పెద్దబావి ఆనంద్‌రెడ్డి, లిక్కి కృష్ణారెడ్డి, జెనిగె శ్రీనివాస్ యాదవ్, గుర్రం లక్ష్మారెడ్డి, సుభాన్‌యాదవ్, ఇక్కె శ్రీనివాస్, పలువురు దివ్యాంగులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి ఒక్కరూ ఓటరు నమోదు చేసుకోవాలి



ఓటర్ నమోదు కార్యక్రమంలో పాల్గొన్న పవన్‌కుమార్

**హైదరాబాద్, జనవరి 9 ప్రభాతవార్త:** 18 సంవత్సరాలు దాటిన ప్రతి ఒక్కరు ఓటర్ నమోదు చేసుకోవాలని కొత్తపేట డివిజన్ కార్పొరేటర్ నాయకోటి పవన్ కుమార్ పేర్కొన్నారు. వాస్విక్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో డివిజన్‌లోని ప్రజయ్ నివాస్ ఫేస్-1లో ఉచిత ఓటర్ నమోదు కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో పవన్‌కుమార్ పాల్గొని నూతన ఓటర్లకు అవగాహన కల్పించారు. ఓటు మార్పు చేర్పులు చేసుకోవాలనుకునే వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, ఈ కార్యక్రమంలో కాలనీ సెక్రెటరీ ప్రసాద్, సాయి, వాస్విక్ ఫౌండేషన్ సభ్యుడు శ్రీకాంత్, నాయకులు కొత్త తిరుమల, గట్టు మహేష్, వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

## ఆర్య వైశ్య సంఘం కమిటీ ఏకగ్రీవ ఎన్నిక



నూతనంగా ఎన్నికైన తుర్కయాంజాల్ మున్సిపాలిటీ ఆర్యవైశ్య సంఘం

**తుర్కయంజాల్, జనవరి 9 ప్రభాతవార్త:** తుర్కయంజాల్ మున్సిపాలిటీ ఆర్య వైశ్య సంఘం నూతన కమిటీ ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఆకు తోట శ్రీనివాస్‌గుప్తా, వర్కింగ్‌అధ్యక్షుడిగా రేణిగుంట రవీందర్‌గుప్తా, ప్రధాన కార్యదర్శిగా పందిరి చక్రధర్‌గుప్తా, కోశాధికారిగా పందిరి యాదయ్య గుప్త, ఉపాధ్యక్షులుగా రంగా శేఖర్‌గుప్తా, దుబ్బ రవీందర్‌గుప్తా, ముఖ్య సలహాదారులుగా దామెర శ్రీకాంత్‌గుప్తా, పోకల జగదీష్‌గుప్తా, సంయుక్త కార్యదర్శిగా పోల సురేష్‌గుప్తా, పొట్లూరి సురేష్ గుప్తా, ఒరుగంటి శ్రీకాంత్ గుప్తా, వీఆర్వో: రంగా శివనాద్ గుప్తా, కార్యదర్శులు: యాద నారాయణగుప్తా, దామెర నవీన్‌గుప్తా, సహాయ కార్యదర్శులుగా ఆరం శ్రీనివాస్ గుప్తా, పాలాది విష్ణువర్ధన్‌గుప్తాలు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా సంఘం సభ్యులు మాట్లాడుతూ ఆర్యవైశ్య సంఘం బలోపేతం చేస్తూ, నిరుపేద ఆర్యవైశ్యులకు సహాయ సహకారాలు అందిస్తామని అన్నారు.

## 13 నుంచి కరణ్‌బాగ్ మల్లన్నస్వామి జాతర

**సైదాబాద్, జనవరి 9 ప్రభాతవార్త:** ఈ నెల 13వ తేదీ కరణ్‌బాగ్ మల్లన్న స్వామి జాతర మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించడానికి అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని ఆలయ కార్యనిర్వాణాధికారి సత్యనారాయణ తెలిపారు. ఉత్సవాల్లో భాగంగా 13వ తేది మొదటి రోజు తెల్లవారురూమున స్వామి వారికి మేలుకొలుపు, అభిషేకం, బిల్వార్చనలు, ఉంటాయని, అదేరోజు సాయంత్రం గంగతెప్ప, మల్లన్నస్వామి ఊరేగింపు నిర్వహించనున్నట్లు ఈఓ తెలిపారు. 14వ తేది మధ్యాహ్నం శ్రీ బలిజ మేడలాదేవి, శ్రీ గొల్లకేతమ్మ సమేత శ్రీ మల్లికార్జునస్వామి కళ్యాణం, అన్నదానకార్యక్రమం ఉంటుందని పేర్కొన్నారు. సాయంత్రం పటం, అగ్నిగుండాలు, గొలుసు తెంపడం కార్యక్రమాలు ఉంటాయని, చివరి రోజు రేణుకా ఎల్లమ్మ, నల్ల పోచమ్మ మహంకాళి అమ్మవార్లకు బోనాల సమర్పణ ఉంటుందని ఈఓ తెలిపారు. జాతర ముగింపు రోజు భక్తులకు వడి బియ్యం, ముత్తయిదువులకు పసుపు కుంకుమ, గాజులు అందజేయడం జరుగుతుందని ఈఓ పేర్కొన్నారు.

## విద్యుత్, తాగునీటి సమస్యల పరిష్కారానికి చర్యలు : కౌన్సిలర్ మురళీధర్‌రెడ్డి



కాలనీవాసులతో మాట్లాడుతున్న కౌన్సిలర్, అధికారులు

**హయత్‌నగర్, జనవరి 9 ప్రభాతవార్త:** అధికారులను సమన్వయం చేసుకుని తాగునీరు, విద్యుత్ సంబంధిత సమస్యలను వెంటనే పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటానని పెద్దఅంబర్‌పేట మున్సిపాలిటీ 9వ వార్డు కౌన్సిలర్ చల్లూరి మురళీధర్‌రెడ్డి అన్నారు. విద్యుత్,నీటిసరఫరాలో సమస్యలపై కాలనీ వాసులు కౌన్సిలర్‌కు ఫిర్యాదు చేయగా... ఆయన మున్సిపాలిటీ డీఈఈ అశోక్‌కుమార్, ఎలక్ట్రిసిటీ ఏఈ చంద్రమౌళితో కలిసి మంగళవారం కాలనీని సందర్శించి కాలనీవాసులతో సమావేశం నిర్వహించారు. కాలనీలో ఏడేళ్ల క్రితంవేసిన పైప్‌లైన్ ఫ్లోరైడ్‌తో నిండిపోవడం, కృష్ణానీరు రోజుతప్పించి రోజు తక్కువ మోతాదుతో రావడంతో రోజువారి అవసరాలకు సరిపోవడం లేదన్నారు. కాలనీలో 100కుపైగా ఇళ్లున్నాయని గతంలో వేసిన ట్రాన్స్‌పార్మర్ కెపాసిటీ సరిపోవడంలేదని అదనపు ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటుచేసి సమస్యను పరిష్కరించాలన్నారు. దీనిపై కౌన్సిలర్ స్పందిస్తూ... పైప్‌లైన్ల మరమ్మతులు చేయించాలని లేని పక్షంలో కొత్త లైన్ వేయాలని డీఈఈకి సూచించారు. విద్యుత్ సమస్యను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్లి అదనపు ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటానని హామీనిచ్చారు. కార్యక్రమంలో కాలనీ ప్రతినిధులు మధుసూదన్‌రెడ్డి, లక్ష్మారెడ్డి, సంజీవ్‌గౌడ్ పాల్గొన్నారు.

## సెన్సార్ బోర్డు సభ్యులకు ఎన్వీఎస్ఎస్ సత్కారం



సెన్సార్ బోర్డు సభ్యులు మహంకాళి లక్ష్మణ్, శ్రీనివాసశర్మలను సత్కరిస్తున్న మాజీ ఎమ్మెల్యే ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్ తదితరులు

**ఉప్పల్, జనవరి 9 ప్రభాతవార్త :** సెన్సార్ బోర్డు సలహామండలి సభ్యులుగా ఎన్నికైన ఉప్పల్ బిజెపి నేతలు మహంకాళి లక్ష్మణ్, గొంగులూరి శ్రీనివాస శర్మలను మంగళవారం మాజీ ఎమ్మెల్యే, బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షుడు డా.ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్ సత్కరించారు.ఈ మేరకు కేంద్ర ప్రసార మంత్రిత్వశాఖ నుంచి ఆదేశాలు జారీ అయ్యాయి. అనంతరం జరిగిన కార్యక్రమంలో ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్ మాట్లాడుతూ ఉప్పల్ నియోజకవర్గం కేంద్రంగా బిజెపి నాయకులుగా గత మూడు దశాబ్దాలుగా వీరు సేవలు అందిస్తున్నారని తెలిపారు. ఒబిసి మోర్చ నాయకుడిగా ఉన్న మహంకాళి లక్ష్మణ్, కిసాన్‌సెల్ నాయకుడిగా శ్రీనివాసశర్మలు సేవలందించినట్లు తెలిపారు. భవిష్యత్‌లో మరిన్ని పదవులు నిర్వహించాలని, పార్టీ బలోపేతానికి తగు చర్యలు తీసుకోవాలని ఆకాంక్షించారు. సెన్సారల్ బోర్డు సభ్యులు మహంకాళి లక్ష్మణ్, శ్రీనివాసశర్మలు మాట్లాడుతూ తమకు పదవులు వచ్చేందుకు సహకరించిన ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్‌కు రుణపడి ఉంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో బిజెపి సీనియర్ నేతలు గొరిగె కృష్ణ, దేవసాని బాలచందర్, రావుల బాలకృష్ణగౌడ్, రెడ్డిగారి దేవేందర్‌రెడ్డి, గోనె శ్రీకాంత్, బింగి దశరధ్, ఈగ లక్ష్మణ్, కొల్లు బాలరాజు, కె.భరత్‌రెడ్డి, రాజేందర్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## మీర్‌పేట్ మంత్రాల చెరువును పరిశీలించిన ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి

**సరూర్‌నగర్, జనవరి 9 ప్రభాతవార్త:** మీర్‌పేట్ కార్పొరేషన్‌లోని మంత్రాల చెరువులో వేగంగా విస్తరిస్తున్న గుర్రపు డెక్కను ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి పరిశీలించారు. కమీషనర్ వాణిరెడ్డి, డిఇఇ గోపినాథ్, మేయర్ ముడావత్ దుర్గ దీప్‌లాల్ చౌహాన్, డిప్యూటీ మేయర్ తీగల విక్రంరెడ్డి, పలువురు కార్పొరేటర్లతో కలిసి ఆమె చెరువును సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె కట్టపై పాదయాత్ర చేసి చెరువులో విస్తరించి పచ్చిక బయలుగా, పంట పొలంగా కనిపిస్తున్న గుర్రపు డెక్కను పరిశీలించారు. ఈ మేరకు ఆమె గుర్రపు డెక్కను తొలగించడానికి తీసుకోవాల్సిన చర్యలపై కమీషనర్, మేయర్, డిప్యూటీ మేయర్, కార్పొరేటర్లతో చర్చించారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ ఫ్లోర్ లీడర్ అర్కల భూపాల్‌రెడ్డి, కార్పొరేటర్ సిద్దాల లావణ్య బీరప్ప, నాయకులు దిండు భూపేష్‌గౌడ్, జె.శ్రీనివాస్ నాయక్, సిరూర్ బాలరాజ్, సిద్దాల బీరప్ప, దీప్‌లాల్ చౌహాన్ తదితరులు పాల్గొన్నారు.

## నేడు మారుతినగర్‌లో ముగ్గుల పోటీలు

**హైదరాబాద్, జనవరి 9 ప్రభాతవార్త:** కొత్తపేట డివిజన్ మారుతినగర్‌లోని జైన్‌మందిర్ వద్ద బుధవారం సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకొని ముగ్గుల పోటీలు నిర్వహిస్తున్నట్లు బిఆర్ఎస్ కొత్తపేట డివిజన్ అధ్యక్షుడు లింగాల రాహుల్‌గౌడ్ తెలిపారు. మారుతినగర్ డెవలప్మెంట్ అసోసియేషన్, రాహుల్‌గౌడ్ ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు నిర్వహిస్తున్నారు. బుధవారం మధ్యాహ్నం 3 గంటలనుంచి సాయంత్రం 5గంటల వరకు పోటీలు జరుగుతాయని తెలిపారు. ఈ పోటీలలో మహిళలు, బాలికలు మాత్రమే పాల్గొనాలని సూచించారు. పోటీలలో పాల్గొనేవారు పోటీల్లో పాల్గొనేవారే ముగ్గులు, రంగులు తెచ్చుకోవాలన్నారు. పోటీలలో గెలుపొందిన వారికి ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులతో పాటు ప్రోత్సాహక బహుమతులు కూడా అందజేస్తామని తెలిపారు.

## ఘనంగా వనస్థలిపురం జాన్సన్ గ్రామర్ పాఠశాలలో వార్షికోత్సవ వేడుకలు



సాంస్కృతిక కార్యక్రమాలను ప్రదర్శిస్తున్న విద్యార్థులు

**మన్సూరాబాద్, జనవరి 9 ప్రభాతవార్త:** వనస్థలిపురం మన్సూరాబాద్ పరిధి సహారా రోడ్‌లో ఉన్న ఎం.ఇ.రెడ్డి గార్డెన్స్‌లో జాన్సన్ గ్రామర్ పాఠశాల వార్షికోత్సవ వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎన్.జి.ఆర్.ఐ ప్రధాన శాస్త్రవేత్తలు డాక్టర్ ఎం.రామ్మోహన్, డాక్టర్ శ్రీనివాస్ శర్మలు ముఖ్య అతిథులుగా విచ్చేసారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు అన్నిరంగాలలో ప్రతిభను చూపాలన్నారు. అనంతరం విద్యార్థుల ప్రదర్శించిన నృత్యాలు, సాంస్కృతిక కార్యక్రమాలతో ఆద్యంతం అద్భుతంగా సాగింది. అదే విధంగా జాన్సన్ గ్రామర్ పాఠశాలల డైరెక్టర్ సురేష్, అకాడమిక్ డైరెక్టర్ లక్ష్మీవిశ్వనాథన్ విద్యార్థులను అభినందించారు. ఈ వేడుకల్లో పాఠశాల అడ్మిన్ అపర్ణ,ప్రధానోపాధ్యాయులు విద్యావ్యాస్, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## టాక్స్ సూపరిండెండెంట్ మహేందర్ సస్పెన్షన్

### ప్రజాపాలన దరఖాస్తుల నిర్లక్ష్యంపై కమిషనర్ ఆగ్రహం

**హైదరాబాద్, జనవరి 9 ప్రభాతవార్త:** హయత్‌నగర్ సర్కిల్ ట్యాక్స్ సెక్షన్ సూపరిండెంటెంట్ ఎం.మహేందర్ సస్పెన్షన్‌కు గురయ్యారు. ఈ మేరకు జిహెచ్ఎంసి కమిషనర్ రోనాల్డ్‌రోస్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేసినట్లు ఎల్‌బినగర్ ఉపకమిషనర్ రవీందర్‌కుమార్ తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజాపాలన కార్యక్రమంలో భాగంగా లబ్ధిదారుల నుంచి వచ్చిన దరఖాస్తులు డేటాఎంట్రీ ఏజెన్సీ ద్వారా రవాణా చేస్తున్న సమయంలో బాలానగర్ ఫ్లైఓవర్ రహదారిపై పడిపోయాయి. ప్రజలు ఇచ్చిన దరఖాస్తులపై సంబంధిత శాఖ అధికారి దిగువ సంతకంతో కూడిన దరఖాస్తులు నడిరోడ్డుపై పడిపోవడం అందుకు టాక్స్ సూపరింటెండెంట్ మహేందర్ నిర్లక్ష్యమే కారణమని సస్పెండ్ చేసినట్లు ఆయన తెలిపారు. ట్యాక్స్ సెక్షన్ టీంలీడర్‌గా ఉన్న మహేందర్ దరఖాస్తులరవాణాను పర్యవేక్షించడంలో విఫలమయ్యాడని విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహించడం వల్లే క్రమశిక్షణ చర్యలో భాగంగా జిహెచ్ఎంసి కమిషనర్ సస్పెండ్ చేశాడని వివరించారు. సస్పెండ్ అయిన మహేందర్‌ను జిహెచ్ఎంసి ప్రధాన కార్యాలయానికి పంపించినట్లు తెలిపారు. ప్రజాపాలన దరఖాస్తులు తరలించే విషయంలో జరిగిన నిర్లక్ష్యంపై అడిషనల్ కమిషనర్, జోనల్ కమిషనర్ విచారణ చేపట్టాలని కూడా జిహెచ్ఎంసి కమిషనర్ ఆదేశాలు జారీ చేశారు.

## ఈ నెల 21నుంచి బ్యాడ్మింటన్ టోర్నమెంట్

**మలక్‌పేట, జనవరి 9 ప్రభాతవార్త:** దిల్‌సుఖ్‌నగర్ షటిల్ ప్లేయర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆఫ్ తెలంగాణ, బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆఫ్ హైద్రాబాద్ సౌజన్యంతో 19వ ఇన్విటేషనల్ రిపబ్లిక్ డే బ్యాడ్మింటన్ టోర్నమెంట్-2024 నిర్వహిస్తున్నట్లు అసోసియేషన్ చైర్మన్ సామ ప్రభాకర్‌రెడ్డి, కన్వీనర్ కరెడ్ల శ్రీనివాసరావు, అధ్యక్షుడు కే. శ్రీనివాస రెడ్డి తెలిపారు. 19, 35, 50 ఏళ్ల పురుషుల డబుల్స్‌లో బ్యాడ్మింటన్ క్రీడాకారుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. మూసారంబాగ్ డివిజన్ ఎస్‌బీహెచ్ కాలనీలోని జీహెచ్ఎంసి ప్లే గ్రౌండ్స్‌లో ఈ నెల 21 నుంచి 25వ తేదీవరకు ఉదయం 5.30 నుంచి 8 గంటల వరకు టోర్నమెంట్ కొనసాగుతుందన్నారు. ఈ నెల 19 తేదిలోగా ఆసక్తి కలిగిన క్రీడాకారులు పేర్లను నమోదు చేసుకోవాలని కోరారు. వివరాలకు 9866331280 నంబర్లలో సంప్రదించవచ్చన్నారు.

## అంకితభావంతో పని చేసే వారికే కాంగ్రెస్ పార్టీలో పదవులు: కెఎల్ఆర్



మాట్లాడుతున్న మహేశ్వరం నియోజకవర్గ కాంగ్రెస్ ఇంఛార్జి కెఎల్ఆర్

**సరూర్‌నగర్, జనవరి 9 ప్రభాతవార్త:** మహేశ్వరం నియోజకవర్గంలో ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా కష్టపడిన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలను అదే విధంగా పార్టీ కోసం అంకితభావంతో పని చేస్తున్న వారికి తప్పకుండా ప్రాధాన్యతనిస్తామని నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంఛార్జి కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి స్పష్టం చేశారు. జల్‌పల్లి మున్సిపాలిటీలో ఏర్పాటు చేసిన కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తల సమావేశానికి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో కాంగ్రెస్‌కు సంబంధించిన అన్ని కమిటీలు రద్దయిన నేపథ్యంలో వాటిని భర్తీ చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని వెల్లడించారు. ఈ నేపథ్యంలో పార్టీ కోసం పనిచేస్తున్న వారిని గుర్తించి వారికి పదవులు కేటాయించి ప్రోత్సహిస్తామని పేర్కొన్నారు. అధిష్టానవర్గం సూచనలమేరకు పనిచేసే వారికి, అర్హులైన వారికి పదవులు ఇచ్చి పార్టీని బలోపేతం చేస్తామని స్పష్టం చేశారు.

## భక్తిశ్రద్ధలతో ధనుర్మాస వ్రత మహోత్సవం

**హైదరాబాద్, జనవరి 9 ప్రభాతవార్త:** ఆర్కేపురం డివిజన్ వాసవి కాలనీలోని శ్రీఅష్టలక్ష్మి దేవాలయంలో ధనుర్మాస వ్రత మహోత్సవ కార్యక్రమాలు భక్తుల కోలాహలం మధ్య అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నారు. డిసెంబర్ 17వ తేదీ నుంచి జనవరి 14వ తేదీ వరకు ధనుర్మాస ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు దేవాలయం కమిటీ ప్రతినిధులు తెలిపారు. ఉత్సవాలలో భాగంగా మంగళవారం పాశురం దీపోత్సవం తదితర కార్యక్రమాలను భక్తుల కోలాహలం మధ్య వేద బ్రాహ్మణుల మంత్రం మధ్య భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.

## సైదాబాద్‌లో నిర్మిస్తున్న స్టీల్ బ్రిడ్జి పనులు పరిశీలించిన ప్రాజెక్ట్ సిఇ దేవానంద్

**సైదాబాద్, జనవరి 9 ప్రభాతవార్త:** సైదాబాద్ మెయిన్ రోడ్డుపై ఉన్న హనుమాన్ దేవాలయంపై నుంచి స్టీల్ బ్రిడ్జి నిర్మాణ పనులను స్థానిక బిజెపి నాయకులతో పాటు భక్తులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తూ జిహెచ్ఎంసి కమిషనర్‌కు ఫిర్యాదు చేయడంతో మంగళవారం ప్రాజెక్టు సిఇ దేవానంద్ సైదాబాద్‌కు వచ్చి దేవాలయం వద్ద స్టీల్ బ్రిడ్జి నిర్మాణ పనులను పరిశీలించారు. కొందరికి అనుకూలంగా ఉండేలా స్టీల్ బ్రిడ్జి నిర్మాణ నమూనాను మార్చడం వల్ల దేవాలయం పై నుంచి స్టీల్ బ్రిడ్జి వస్తుందని, ప్రాజెక్టు అధికారులు అక్రమాలు, అవినీతికి పాల్పడ్డారంటూ కార్పొరేటర్ కొత్తకాపు అరుణ రవీందర్ రెడ్డి, నగర మాజీ డిప్యూటీ మేయర్ సుభాష్ చందర్జీ, మాజీ కార్పొరేటర్ సహదేవ్ యాదవ్, భాగ్యనగర్ జిల్లా అధ్యక్షుడు సంరెడ్డి సురేందర్‌రెడ్డిలు సిఇకి ఫిర్యాదు చేశారు. దేవాలయంపై నుంచి స్టీల్ బ్రిడ్జి నిర్మాణాన్ని చేపట్టాలని చూస్తే భక్తులతో కలిసి ఆందోళనకు దిగుతామని వారు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో వినయ్ కిషోర్ యాదవ్, చొవ్వ మహేష్, ఉగాది మహేష్, శ్రీకాంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## చిలుకానగర్‌లో కార్పొరేటర్ గీత పర్యటన



డివిజన్‌లో పర్యటిస్తున్న కార్పొరేటర్ బన్నాల గీత ప్రవీణ్ తదితరులు

**ఉప్పల్, జనవరి 9 ప్రభాతవార్త :** చిలుకానగర్ డివిజన్ న్యూరాంనగర్‌లో కార్పొరేటర్ బన్నాల గీత ప్రవీణ్ అధికారులతో కలిసి పర్యటించారు. కాలనీలో పురాతన సివరేజీ పైప్‌లైన్ తొలగించి కొత్త లైన్లు వేయాలని అధికారులను కోరారు. అనంతర జరిగిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ డివిజన్ పరిధిలో పాడైన రోడ్లకు ప్రతిపాదనలు రూపొందించాలని సూచించారు. కొత్త సివరేజ్ లైన్ ఏర్పాటుకు అంచనాలు రూపొందించాలని అధికారులను ఆదేశించారు. డివిజన్‌లో ప్రజలకు మౌళిక సదుపాయాలు కల్పిండచమే ధ్యేయంగా ముందుకు సాగుతున్నామన్నారు. కార్యక్రమంలో బిఆర్ఎస్ నేతలు బన్నాల ప్రవీణ్, కొండల్‌రెడ్డి, కె.జగన్, రామచందర్,బింగి శ్రీనివాస్, మహుమూద్, శ్రీనివాస్, లక్ష్మణ్, అసోసియేషన్ నేతలు వెంకటాచారి, భాస్కర్‌రెడ్డి, నరసింహా తదితరులు పాల్గొన్నారు.

## కాంట్రాక్టర్ల పెండింగ్ బిల్లులను చెల్లించాలి

**కుషాయిగూడ, జనవరి 9, ప్రభాతవార్త :** సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్న కాంట్రాక్టర్ల బిల్లులను వెంటనే చెల్లించాలని జిహెచ్ఎంసి కాంట్రాక్టర్స్ అసోసియేషన్ అధ్యక్షులు రవీంద్రసాగర్ డిమాండ్ చేసారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్న కాంట్రాక్టర్ల బిల్లులు చెల్లించనికారణంగా తమ కుటుంబాలు వీధినపడ్డాయని, కొందరు బడా అధికారుల అక్రమార్జన మూలంగా తాము అనేక ఇబ్బందుల గురై బిల్లులు పొందలేక పోతున్నామని ఆవేదన వ్యక్తం చేసారు. మా కుటుంబాల్లో అనారోగ్యానికి గురయిన హాస్పిటల్‌కు చూయించుకునే పరిస్థితి లేకుండా పోయిందన్నారు. వెనుకబడిన కాంట్రాక్టర్ల పేమెంట్లు సంక్రాంతి పండుగలోపు రిలీజ్ చేయాలని కోరారు. లేనిపక్షంలో ప్రతి ఒక్క కాంట్రాక్టర్ ప్రతి సర్కిల్లో ధర్నాకు దిగుతామని, అదే విధంగా ప్రజాభవన్ దగ్గర కూడా ధర్నా చేపడతామన్నారు. ఈ కార్యక్రమంలో సైదులు సాగర్, రవిసాగర్, బొంత రవి, వెంకటస్వామి, రాజు, శేఖర్‌సాగర్, గిరి, రమేష్, కాప్రా సర్కిల్ కాంట్రాక్టర్లు పాల్గొన్నారు.

## శ్రీపురం కాలనీ ఫేస్-2 సమస్యలను పరిష్కరించాలి : కార్పొరేటర్ లచ్చిరెడ్డి



అధికారులతో కలిసి కాలనీలో పర్యటిస్తున్న కార్పొరేటర్ లచ్చిరెడ్డి

**వనస్థలిపురం, జనవరి 9 ప్రభాతవార్త:** బి.యన్‌రెడ్డినగర్ డివిజన్ శ్రీపురం కాలనీ ఫేస్-2 కాలనీవాసుల విజ్ఞప్తి మేరకు డివిజన్ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి సంబంధిత అధికారులతో కలిసి కాలనీలో పర్యటించారు. కాలనీలోని ప్రధాన సమస్యలైనా డ్రైనేజ్, రోడ్లు, త్రీఫేస్ కరెంట్, వీధి దీపాలు, కరెంటు స్తంభాలు, రోడ్డుకు ఇబ్బందికరంగా ఉన్న చెట్ల కొమ్మలను తొలగించాలని కాలనీవాసులు కార్పొరేటర్‌ను కోరారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ విడతల వారిగా ఒకటొకటిగా కాలనీలోని ప్రతి సమస్య పరిష్కారం అయ్యే విధంగా కృషి చేస్తానని, సమస్యలపై సబంధిత అధికారులు చర్యలు తీసుకునేలా చర్యలు చేపడతామని తెలిపారు. కార్యక్రమంలో ఏఈ రాకేష్, విద్యుత్ ఏఈ రణధీర్, వాటర్ వర్క్స్ మేనేజర్ రవీందర్‌రెడ్డి, అజిముద్దీన్, జవాన్ రామచందర్, హార్టికల్చర్ సూపర్వైజర్ రాజేష్, భూపాల్‌రెడ్డి, బొమ్మ రఘురామ్‌నేత, విష్ణువర్ధన్‌రావు, శ్రావణ్‌రెడ్డి కాలనీ సంక్షేమ సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## రాజకీయాలు పక్కన పెట్టి అభివృద్ధి బాట పట్టండి : ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి



కళ్యాణలక్ష్మీ చెక్కుల పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే మల్‌రెడ్డిరంగారెడ్డి

**అబ్దుల్లాపూర్‌మెట్, జనవరి 9 ప్రభాతవార్త:** రాజకీయాలను పక్కనపెట్టి అందరూ అభివృద్ధి బాట పట్టాలని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి పేర్కొన్నారు. అబ్దుల్లాపూర్‌మెట్ మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం జరిగిన కల్యాణలక్ష్మీ, షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై 20 మంది లబ్దిదారులకు చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికలకు ముందుకు ఇచ్చిన హామీలతోపాటు ప్రభుత్వ సంక్షేమ పథకాలన్నీ అమలు చేసి తీరుతామన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి పాలనలో ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలతో మేలు జరుగనున్నదన్నారు. మండల పరిషత్ పరిధిలో నిర్వహించే సమావేశాలకు అన్ని శాఖల అధికారులు హాజరవ్వాలని ఆదేశాలు జారీ చేశారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాల్సిన బాధ్యత అధికారులు, ప్రజా ప్రతినిధులపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ బుర్ర రేఖామహేందర్ గౌడ్, జడ్పీటీసీ దాసుగౌడ్, వైస్‌ఎంపీపీ కొలన్ శ్రీధర్‌రెడ్డి, తహసీల్దార్ రవీందర్‌దత్తు, ఎంపీడీఓ మీరాబాయి, మున్సిపల్ వైస్‌ఛైర్‌పర్సన్ చామ సంపూర్ణ విజయశేఖర్‌రెడ్డి, సర్పంచులు కరిమెల వెంకటేష్, మూల మహేష్‌గౌడ్, లతా శ్రీ, సుధాకర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, మల్లేష్, రంగయ్య ఎంపీటీసీలు వెంకటేష్, బాలలింగస్వామి, బాలమణి, మహ్మద్ గౌస్‌పాష, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కొత్త ప్రభాకర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## కర్మన్‌ఘాట్ దేవాలయంలో డిసిపి పూజలు



డిసిపి సాయిశ్రీకి స్వామి వారి చిత్ర పటాన్ని అందజేస్తున్న చైర్మన్ రఘుమారెడ్డి

**సైదాబాద్, జనవరి 9 ప్రభాతవార్త:** ఈస్ట్ జోన్ డిసిపి సాయిశ్రీగౌడ్ మంగళవారం కర్మన్‌ఘాట్ ధ్యానాంజనేయ స్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో దేవాలయ పాలక మండలి చైర్మన్ నల్ల రఘుమారెడ్డి,కార్యనిర్వాణాధికారి ఎం.శ్రీనివాసశర్మ, ధర్మకర్తలు మధుసాగర్, అంజిరెడ్డి, సురేందర్‌రెడ్డి, తిరుమలేష్, మధుసూధన్‌రెడ్డి, శైలజ, సురేష్ గౌడ్, ఆనంద్‌గౌడ్, శ్రీనివాస్ యాదవ్, సతీష్‌గౌడ్‌లు పాల్గొన్నారు.

## ఉప్పల్‌లో నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

**ఉప్పల్, జనవరి 9 ప్రభాతవార్త :** ఉప్పల్ సబ్‌స్టేషన్ పరిధిలో పలు ప్రాంతాల్లో బుధవారం విద్యుత్ మరమ్మతులు చేపడుతున్న దృష్ట్యా విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ఎఇ ఎం.నిఖిల్ తెలిపారు. ఉప్పల్ స్వరూప్‌నగర్, శ్రీశ్రీనగర్ పీడర్ పరిధిలో ఉదయం 10గంటలనుంచి 12 వరకు, కూరగాయల మార్కెట్ పరిధిలో మధ్యాహ్నం 12 నుంచి 2 గంటల వరకు సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు. స్వరూప్‌నగర్, మల్లికార్జుననగర్, శ్రీశ్రీనగర్, ఎన్ఎన్ కాలనీ, సెవెన్‌హిల్స్, వెంకటేశ్వర టెంపుల్, శ్రీనివాసా కాలనీ, కూరగాయల మార్కెట్ తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని తెలిపారు. ప్రజలు ఈ అవకాశాన్ని గమనించాలని కోరారు.

## దొంగతనాల నివారణకు పోలీసుల ప్రచారం

**హైదరాబాద్, జనవరి 9 ప్రభాతవార్త:** సంక్రాంతి పండుగ సందర్భంగా ఊర్లకు వెళ్లేవారు అప్రమత్తంగా ఉండాలని చైతన్యపురి ఇన్స్పెక్టర్ నాగార్జున తెలిపారు. రాచకొండ కమిషనరేట్ పరిధిలోని ప్రజలు సంక్రాంతి పండుగకు ఊరికి వెళ్లే వారికి దొంగతనాల నివారణకు సంబంధించి చైతన్యపురి పోలీస్‌స్టేషన్ పరిధిలో మంగళవారం ప్రచారాన్ని చేపట్టినట్లు పలు సలహాలు సూచనలు చేస్తున్నట్లు ఇన్స్పెక్టర్ తెలిపారు. సెలవుల కారణంగా గ్రామాలకు వెళుతున్న నేపథ్యంలో ఇంటికి తాళం వేసేవారు పోలీసులు ఇచ్చే సలహాలను సూచనలను పాటించాలన్నారు. దొంగతనాలు జరగకుండా పోలీసు శాఖ ఇస్తున్న సూచనలను పాటించడం వల్ల దొంగతనాలను తగ్గించవచ్చని తెలిపారు.

## అయోధ్య రామాలయ అక్షింతలు పంపిణీ

**తుర్కయంజాల్, జనవరి 9 ప్రభాతవార్త:** ఉమార్‌ఖాన్‌గూడ గ్రామాలలో అయోధ్య రామాలయ విగ్రహ ప్రతిష్టలో భాగంగా కౌన్సిలర్ ఫ్లోర్ లీడర్ కరాడి శ్రీలత అనిల్‌కుమార్ ఆధ్వర్యంలో ఇంటింటికి అక్షింతలు పంపిణీ చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అయోధ్యలో భవ్య రామ మందిర ప్రాణ ప్రతిష్టలో భాగంగా 22వ తేదీన హిందువులంతా సంబరాలు జరుపుకోవాలన్నారు. కార్యక్రమంలో గజ్జల శ్రీనివాస్‌రెడ్డి, తుళ్ల శంకరయ్య గౌడ్, సుధాకర్‌గౌడ్, లక్ష్మారెడ్డి, హనుమంత్‌గుప్తా, గ్రామస్థులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే బిఎల్ఆర్ పేదల పక్షపాతి : కొండల్‌గౌడ్



నిరుపేదకు ఎల్‌ఓసి అందిస్తున్న దృశ్యం

**కుషాయిగూడ, జనవరి 9 ప్రభాతవార్త :** పేదల ప్రాణాలు కాపాడుతున్న బండారి లక్ష్మారెడ్డి పేదల పక్షపాతి అని బిఆర్ఎస్ సీనియర్ నాయకులు కొండల్‌గౌడ్ పేర్కొన్నారు. కాప్రాడివిజన్ సాయిరాంనగర్ ప్రాంతానికి చెందిన నిరుపేద వ్యక్తి యాదగిరి గుండె ఓపెన్ హార్ట్ సర్జరీ కోసం వైద్యానికి డబ్బులు లేని కారణంగా కొండల్‌గౌడ్‌ను సంప్రదించడంతో ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ని కలిసి వైద్యానికి అయ్యే ఖర్చు ఎల్‌ఓసి సర్టిఫికెట్ ఇప్పించడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉప్పల్ నియోజకవర్గ పరిధిలో ఉన్న నిరుపేదలందరి కష్టాలను తీరుస్తూ విద్యా వైద్యంతో పాటు అనేక రకాలుగా ఆదుకుంటున్న ఎమ్మెల్యే బండారు లక్ష్మారెడ్డి సేవలు మర్చిపోలేమన్నారు.

## ఉద్యమకారుల సమస్యలను తెలిపి వాటిని పరిష్కరించే విధంగా చర్యలు

**తుర్కయంజాల్, జనవరి 9 ప్రభాతవార్త:** తెలంగాణ ఉద్యమకారుల ఫోరం తరపున ప్రొఫెసర్ కోదండరాంను మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రంగారెడ్డి జిల్లా కన్వీనర్‌గా దుగ్గానీ శ్యామలను నియమించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉద్యమకారులపై కేసులుంటేనే కాకుండా ఎలాంటి కేసులు లేకున్నా ఉద్యమంలో ఆనాడు పాల్గొన్నటువంటి పేపర్ క్లిప్పింగ్స్ ఆధారాలతో కూడా గుర్తించాలని ఉద్యమం చేసినటువంటి ప్రతీ ఉద్యమకారునికి లబ్ది చేకూరేవిధంగా రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి ఉద్యమకారుల అంశాన్ని తెలిపి సమస్యలను పరిష్కరించాలని కోరడం జరిగినది. దానికి ప్రొఫెసర్ కోదండరాం సానుకూలంగా స్పందించడం జరిగింది. తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రంగారెడ్డి జిల్లా కన్వీనర్ గా ఇచ్చినందుకు మాట నిలబెట్టుకుంటానని అందరికీ ఎటువంటి సమస్యలు ఉన్న వాళ్ళ వెంట ఉండి పనిచేస్తూ వారికి సహాయ సహకారాలు అందిస్తూ వాళ్లకు ఎటువంటి ఇబ్బందులు ఉన్న ఆదుకుంటామని అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షులు డా. చీమ శ్రీనివాస్, సురేందర్‌రెడ్డి, జెనిగె విష్ణువర్ధన్, గుర్జని వెంకటేశంగౌడ్, కారింగుల నరేందర్‌గౌడ్, కొంతం యాదిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.